నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
మంగళవారం 19, డిసెంబర్ 2023




## ప్రజలకోసం సమిష్టిగా పనిచేద్దాం

-ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



5 లో..

# దొంగలున్నారు... జాగ్రత్త



- మహిళలకు వరంగా మారిన మహాలక్ష్మి పథకం
- డిపో నుండి రోజుకు 13 వేలమంది మహిళల ప్రయా
- పోలీసు పహారా ఏర్పాటు చేశాం - డిఎస్పి రెహమాన్
- సిసి కెమెరాల ఏర్పాటుకు అనుమతి కోరాం - డిపో మేనేజర్

2 లో..

**కొత్తగూడెం టౌన్, సూర్య (మేజర్‌న్యూస్) -** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మహిళల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు అధికసంఖ్యలో ప్రయాణం చేస్తుండటంతో వారిలో ఆనందం వెల్లి విరిస్తుంది. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ఆర్టీసి డిపోలో 50 బస్సులుండగా ప్రతిరోజు 13 వేల మంది మహిళలు ప్రయాణం చేస్తున్నారు. ఏ బస్సు చూసిన మహిళలతో కిక్కిరిసిపోతుంది.

# ఆరు గ్యారంటీ లను ఖచ్చితంగా అమలు చేస్తాం

- మంత్రి పొంగులేటి

**ఖమ్మం, సూర్య బ్యూరో డిసెంబర్ 18:** ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 6 గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామని రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

2 లో..



## ప్రజల అభీష్టం మేరకే పనిచేస్తాం

తుమ్మల యుగంధర్



6 లో..

# సింగరేణిని కాపాడేది బిఎంఎస్ మాత్రమే

- బిఎంఎస్ జాతీయ నాయకులు కొత్త కాపు లక్ష్మారెడ్డి
-కాగడ గుర్తుపై ఓటు వేసి బిఎంఎస్ ను గెలిపించాల్సిందిగా పిలుపు
-బిఎంఎస్ ఎన్నికల హామీ పత్రం విడుదల

2 లో..

**కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)-** సింగరేణి సంస్థ పరిరక్షణకై గోలేటి నుండి సత్తుపల్లి వరకు కార్మిక చైతన్య చేసి సింగరేణిలో జరుగుతున్న అవినీతి అక్రమాలను ఎండగట్టుతూ కార్మిక హక్కుల పరిరక్షణకై పోరాడిడింది బిఎంఎస్ మాత్రమేనని బిఎంఎస్ జాతీయ నాయకులు కొత్త కాపు లక్ష్మారెడ్డి అన్నారు.



# దొంగలున్నారు... జాగ్రత్త

పురుష ప్రయాణికుల రాకపోకలు మందకొడిగా కొనసాగుతున్నప్పటికి వారు కూడా తమ ప్రయాణాలను వాయిదా వేసుకొనలేకపోతున్నారు. అయితే ఇటివల బాబుక్యాంపుకు చెందిన ఒక మహిళ బ్యాగు నుండి 20 తులాల బంగారం దొంగతనానికి గురైందని సమాచారం. డిపో ఆవరణలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం వలన బస్టాండ్ ఆవరణలో అసలు ఏం జరుగుతుందో అర్దం కావడం లేదు. బస్టాండ్ ఆవరణలో సిసి కెమెరాలు ఏర్పాటు అయ్యాయా... లేదా.. అంటూ కొంతమంది పాత్రికేయులు పరిశీలించారు. చివరకు బస్టాండ్‌లోని ప్రయాణికులు కూర్చునే ప్రాంతాల్లో సిసి కెమెరాలు కనిపించాయి. కాగా ఈ సిసి కెమెరాలు ఎవరివి అంటూ ఆరా తీయగా బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసుకున్న షాపుల యజమానులు తమ భద్రత కోసం సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. బస్టాండ్ ఆవరణలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం వలన అధికసంఖ్యలో ప్రయాణం చేస్తున్న మహిళలకు వారి వస్తువులకు భద్రత లేకుండా పోయింది.

**– బస్టాండ్ ఆవరణలో పోలీసు పహారా ఏర్పాటు చేశాం = డిఎస్పి అబ్దుల్ రెహమాన్**

బస్సుల్లో ప్రయాణం చేసే మహిళలు తమ వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలని డిఎస్పి రెహమాన్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం



ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకం ద్వారా ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఏర్పాటు కావడంతో మహిళలు అధికసంఖ్యలో ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు భద్రత కల్పించే విషయంలో అన్ని జాగ్రత్తలతోపాటు పోలీసు పహారాను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని కొత్తగూడెం డిఎస్పి తెలిపారు. మహిళ ప్రయాణికులు నిత్యం పెద్దసంఖ్యలో రాకపోకలు చేస్తున్నందున బస్టాండ్ ఆవరణలోనే కాకుండా బస్టాండ్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా పహారా ఏర్పాటు చేశామన్నారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేసే విషయంలో ఆర్డీసి అధికారులకు సూచించామన్నారు. బస్సులో ప్రయాణం చేసే సమయంలో అనుమానస్పదంగా ఎవరైన కనిపించిన వెంటనే పోలీసువారికి సమాచారం అందచేయాలని పేర్కొన్నారు.

**– 15 రోజుల క్రితం సిసి కెమెరాల ఏర్పాటుకు అనుమతి కోరాం = డిపో మేనేజర్ బి.వెంకటేశ్వరరావు**

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యార్థం బస్టాండ్ ఆవరణలో అన్ని ఏర్పాట్లు చేశాం. సిసి కెమెరాలు



ఏర్పాటు కోసం 15 రోజుల క్రితం ఆర్టీసి యాజమాన్యానికి ప్రపోజల్ పెట్టామన్నారు. ఆ సిసి కెమెరాలు రావడంతోనే బస్టాండ్ ఆవరణలోను, చుట్టూ పక్కల ప్రాంతాల్లోను ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలు అధికసంఖ్యలో ప్రయాణం చేస్తుండటంతో వారి పట్ల ఆర్టీసి సిబ్బంది కూడా పూర్తిస్థాయిలో సహకరిస్తున్నట్లు, సిసి కెమెరాల ఏర్పాటు మాత్రం తప్పనిసరిగా జరుగుతుందని డిపో మేనేజర్ వెల్లడించారు.



## సింగరేణిని కాపాడేది బిఎంఎస్ మాత్రమే

సోమవారం సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్,బిఎంఎస్ ఆధ్వర్యంలో లక్ష్మారెడ్డి కొత్తగూడెం ఏరియాలో సుడిగాలి పర్యటన చేశారు. దీనిలో భాగంగా కొత్తగూడెం ఏరియాలో జే వి ఆర్ ఓ సి లో సమావేశం నిర్వహించారు. అదేవిధంగా హెడ్ ఆఫీస్ లో వ్యక్తిగతంగా డిపార్ట్మెంట్ వారిగా కార్మికులను కలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని ఏటీఎం గా మార్చుకొని నిధుల దుర్వినియోగం పై కార్మికులను చైతన్య పరిచి, కార్మిక హక్కులను కాపాడింది బి ఎం ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు.సింగరేణిలో ఎన్నికలు నిర్వహించాలని కోర్టుల ద్వారా తీర్పులు వచ్చిన గత ప్రభుత్వము సింగరేణిలో చేసిన అక్రమాలు స్వయంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, సింగరేణి ఎన్నికలకు భయపడి వాయిదాకు ప్రయత్నం చేసిందని, అదే పద్ధతిలో కొత్తగా వచ్చిన ప్రభుత్వం కూడా ప్రయత్నించడం సోచనీయమన్నారు. రాజకీయ లబ్ధి కోసం కార్మిక ఎన్నికల్ని వాడుకోవటం సమస్త భవిష్యత్తుకు మంచిది కాదని పేర్కొన్నారు.బొగ్గు గని కార్మికులకు 11వ వేతన ఒప్పందంలో ఎం జి బి 19 శాతం, అలవెన్స్‌లో 25% పెరుగుదలతో కూడిన మెరుగైన ఒప్పందం సాధించడంలో కీలక పాత్ర పోషించామని ఇది చారిత్రాత్మకమైన ఒప్పందని తెలిపారు. సీఎం పిఎఫ్ లో జరుగుతున్న అవినీతినీ బయటపెట్టి పోరాటం చేస్తున్నది బిఎంఎస్ సీఎం పిఎఫ్ ట్రస్ట్ బోర్డులో మిగతా సంఘాలు ఉన్నప్పటికీని ఈ అవినీతిపై ఎందుకు ప్రశ్నించడం లేదో జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో బిఎంఎస్‌ను గుర్తింపు సంఘంగా గెలిపిస్తే పలు హామీలు నెరవేర్చుటకు పోరాటం చేస్తామని బిఎంఎస్ ఎన్నికల హామీ పత్రం విడుదల చేసారు. సింగరేణిలో పెరిగిన రాజకీయ జోక్యాన్ని అరికట్టి కొత్త బొగ్గు గనులను సాధించి పూర్వవైభావాన్ని తీసు కోస్తామని, సింగరేణి కార్మికులకు 250 గజాల ఇంటి స్థలము, రూ 20 లక్షల వడ్డీ లేని రుణము ఇప్పించుటకు కృషి చేస్తుందన్నారు. కోల్ ఇండియాలో మాదిరిగా సింగరేణి లో కూడా పెర్క్స్ ఇన్కమ్ టాక్స్ ను రియంబర్స్మెంట్ చేపిస్తామని అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్న రాయాల్టీ టాక్స్ నుండి కార్మికుల ఇన్కమ్ టాక్స్ రియంబర్స్మెంట్ చేయుటకు పోరాటం చేస్తామని తెలిపారు.సింగరేణిలో రామగుండం, శ్రీరాంపూర్, కొత్తగూడెం మూడు ఏరియాలలో సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలు ఏర్పాటు చేసి కార్మికులకు మెరుగైన వైద్య సౌకర్యం అందించడానికి కృషి చేస్తామని తెలిపారు.బదిలీ వర్కర్ డెసిగ్నేషన్ కోల్ ఇండియాలో రద్దయి దశాబ్దాలు గడుస్తున్న గతంలో ఉన్న గుర్తింపు సంఘం వైఫల్యం వల్ల సింగరేణిలో కొనసాగుతుందని ఆవేదన తెలిపారు, కావున సింగరేణిలో బదిలీ వర్కర్ రిజర్వేషన్ రద్దు చేస్తామని, అంతేకాదు దేశవ్యాప్తంగా బొగ్గు గనులలో జనరల్ మజ్దూర్ డెసిగ్నేషన్ రద్దుచేసి గౌరవప్రదమైన డెసిగ్నేషన్ అమలు చేయుటకు తగిన చర్యలు తీసుకుంటామని , మెరుగైన క్యాడర్ స్కీమ్ అమలుకై కృషి చేస్తామని తెలిపారు. సింగరేణిలో కార్మికుల పిల్లలకు మెరుగైన విద్య కోసం అన్ని స్కూళ్లలను కేంద్రీయ విద్యాలయాలుగా మార్చి నాణ్యమైన విద్య అందించుటకు కృషి చేస్తామని పేర్కొన్నారు.రాబోయే 12వ వేతన ఒప్పందాన్ని సకాలంలో 12వ జేబీసీసీఐ కమిటీ ఏర్పాటు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాలలో ఏబికేఎంఎస్ కార్యదర్శి, జేబిసిసిఐ, సిపిఆర్ఎంఎస్,ఎన్ఈ సభ్యులు పి. మాధవ నాయక్, యూనియన్ ప్రధాన కార్యదర్శి టి ఎస్ పవన్ కుమార్, బిఎంఎస్ నాయకులు టీ. నరేంద్ర బాబు, మహేష్ కుమార్,రాష్ట్ర బిఎంఎస్ కాంట్రాక్ట్ కార్మికుల అధ్యక్షులు, జి.వి కృష్ణారెడ్డి కార్పోరేట్ ఏరియా ఉపాధ్యక్షులు, మొగిలి పాక రవి ఏరియా ఉపాధ్యక్షులు, నాగ ప్రసాద్ ఏరియా సెక్రటరీ, సంగం చందర్ యూనియన్ కార్యవర్గ సభ్యులు, శ్యాంసుందర్ జెవిఆర్ పిట్ సెక్రటరీ, మల్లారెడ్డి అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ, అయిత రవి, శ్రీకాంత్, చారి, మోటర్ మెకానిక్ రవి, యూనియన్ నాయకులు, కాసర్ల మోహన్, బి.భీమా, విఎన్ మూర్తి, రాజమౌళి, రాంసింగ్ సుందర, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.





## ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన ఆరు గ్యారంటీ లను ఖచ్చితంగా అమలు చేస్తాం







సోమవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో పాలేరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రజలు ఆశించిన ఆశయాల మేరకు, వారి నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయమని అన్నారు. ప్రతి అంశంలో రాష్ట్ర వ్యాప్తంగా శ్వేత పత్రం విడుదల చేస్తామన్నారు. అధికారులు తమ తమ శాఖలకు సంబంధించి ఖచ్చితమైన లెక్కలు ఇవ్వాలన్నారు. సమీక్షలో పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, ఇర్రిగేషన్, రోడ్లు భవనాలు, డబల్ బెడ్ రూమ్, వైద్యం, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ శాఖల పనులపై సమీక్ష చేశారు. మిషన్ భగీరథ ద్వారా క్షేత్ర స్థాయిలో ఎంత మంది ప్రజలు, ఎన్ని గృహాలకు త్రాగునీటి సరఫరా చేస్తున్నది నివేదిక సమర్పించాలన్నారు. విద్యుత్ ఎన్ని గంటలు ఇస్తున్నది తెలుపాలన్నారు. జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలకు స్థల కేటాయింపు, ఫ్యాకల్టీ, పూర్తి స్థాయిలో కళాశాల నడిచేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవే ద్వారా చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతి, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పాలేరు నియోజకవర్గ పరిధిలో పంచాయతీ రాజ్ కు సంబంధించి 2 సబ్ డివిజన్లు ఉన్నట్లు, 143 గ్రామ పంచాయతీలు ఉండగా, 95 గ్రామ పంచాయతీలకు స్వంత భవనాలు ఉండగా, 43 భవనాలు ఇజిఎస్ క్రింద మంజూరయి పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగిలిన 5 గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణానికి ఇజిఎస్ క్రింద ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. సీతారామ ప్రాజెక్టు క్రింద 2 ప్యాకేజీల పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. అవసరం లేని చోట భూసేకరణలు చేసిన దగ్గర అవసరాలకు పనికివచ్చే భూములను చుట్టుపక్కల గ్రామాల నిరుపేదలకు పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. మున్నేరు వాగు నుండి లిఫ్ట్ లేకుండా, గ్రావిటీ తో సీతారామ ప్రాజెక్టుకు నీరు వెళుతుందా, ప్రణాళిక చేయాలన్నారు. పాలేరు లింక్ కెనాల్ కు సంబంధించి, భూసేకరణకు, రైతులతో మాట్లాడతానని, పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా నియోజకవర్గ పరిధిలో 5 కాలనీల్లో 97 గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు, 2 కాలనీల్లో సంక్రాంతి లోగా పూర్తయే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికి కేటాయించిన డబల్ బెడ్ రూం ఇండ్లు, గ్రామ సభ ద్వారా, లాటరీ ద్వారా, ఏ ప్రాతిపదికన కేటాయించింది నివేదిక సమర్పించాలన్నారు. తహశీల్దార్లు ఇప్పటికి జారీచేసిన పొజిషన్ సర్టిఫికెట్లు, పాస్ బుక్ లు పునః పరిశీలించి తప్పులు జరిగితే సరిదిద్దాలన్నారు. అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని, రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఆర్డీవోలు ఇట్టి విషయాల్లో పర్యవేక్షణ చేయాలన్నారు. వైద్యానికి సంబంధించి పాలేరు నియోజకవర్గంలో ఎన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఎంతమంది సిబ్బంది ఉన్నది, ఎంత మంది ఖాళీలు ఉన్నవి నివేదిక ఇవ్వాలన్నారు. వైద్యాధికారులు క్షేత్ర స్థాయిలో విధులకు హాజరు అవుతున్నది, పనిచేయు స్థలంలో ఉంటున్నది నివేదిక ఇవ్వాలన్నారు. 7/24 వైద్యాధికారులు అందుబాటులో ఉండేలా, ప్రభుత్వ వైద్యశాలలపై ప్రజలకు నమ్మకం కల్గెలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డయాలసిస్ రోగులు నియోజకవర్గంలో ఎంతమంది ఉన్నది తెలపాలని, వైద్య విషయంలో పాలేరు ను ఆదర్శంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం గ్రామాల్లో బెల్ట్ షాపులు లేకుండా చూడాలన్నారు. నియోజకవర్గ పరిధిలో నగరానికి చుట్టుపక్కల జరిగిన రిజిస్ట్రేషన్లను పరిశీలించాలని, నిబంధనల మేరకు పనులు జరగాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తెలిపారు. ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ఇబ్బందులు, సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఉద్యోగులు ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని, పాలసీలపై ఇన్ పుట్ ఇవ్వాలని, సమిష్టి గా పనిచేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. ఆర్థిక వ్యవస్థను అతికొద్ది రోజుల్లో గాడిలోకి తెస్తామని, వేతనాలు 1-5వ తేదీలోగా ఇచ్చేలా చర్యలు చేపడతామని అన్నారు. ప్రారంభమయి 50 శాతానికి పైగా పురోగతిలో ఉన్న పనులను పూర్తి చేయాలని, మంజూరయిన పనులు పునః సమీక్షించి, ప్రాధాన్యత ప్రకారంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. కుటుంబ సభ్యులుగా కలిసి పనిచేస్తామని, ప్రభుత్వం మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయమని, రెవిన్యూ, భూ, అనేక సెక్టార్లలో సంస్కరణలు తెస్తామని, అందరం కలిసి ప్రజలకు మంచి చేసినదే నిజమైన పరిపాలన అని మంత్రి తెలిపారు. ఈ సమీక్ష లో జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్. వారియర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, అదనపు డిసిపి ప్రసాద రావు, జిల్లా అధికారులు, డివిజన్, పాలేరు నియోజకవర్గ మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బి-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కందిమళ్ల వీరబాబుకు ఘన సన్మానం



ముదిగొండ సూర్య మేజర్ న్యూస్:-
జిల్లా కాంగ్రెస్ పార్టీ సంజీ వరెడ్డి భవన్ లో కార్యా లయంలో సోమవారం జరిగిన సన్మాన కార్యక్ర మంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్. వైరా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి కి ఆదివారము జరిగిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా ఉంటూ ఎన్నో కార్యక్రమాలను టిఆర్ఎస్ పార్టీకి ఎదురు నిలబడి కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడి ఎదుర్కొని శ్రమించినందుకు పార్టీ విధేయుడుగా గుర్తించి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ మరియు ఖమ్మం పట్టణ అధ్యక్షులు దావీదు పి సి సి సభ్యులు రాయల నాగేశ్వరరావు గార్ల సమక్షంలో శాలువా తో సత్కరించారు వారికి ధన్యవాదాలు తెలిపారు.

## ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్ చార్జ్‌గా పొంగులేటి



ఖమ్మం:(సూర్య బ్యూరో)
లోక్ సభ ఎన్నికలకు సంబంధించి ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్ చార్జ్ గా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ నుంచి సోమవారం ఓ ప్రకటన వెలువడింది.రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్య మంత్రి సహా పలువురు మంత్రులకు బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో ఖమ్మం పొంగులేటికి అప్పగించారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే



సత్తుపల్లి సూర్య మేజర్ న్యూస్:-
సత్తుపల్లిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు మండల పరిషత్ పాఠశాలను సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆకస్మిక తనిఖీ చేశారు..అనంతరం తరగతి గదులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను ఆరా తీశారు.టాయిలెట్స్, తాగునీరు వసతులు,పాఠశాల విద్యార్థులు హాజరు పట్టిక,హాజరు శాతాన్ని ప్రధానోపాధ్యాయుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి మంచిగా చదువుకొని,చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి అని తెలిపారు.

## మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావుకు ఘన సన్మానం

బోనకల్, సూర్య మేజర్ న్యూస్):
ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్, సిపిఐ, వైఎస్ఆర్టిపి పొత్తులో భాగంగా పది అసెంబ్లీ స్థానాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొమ్మిది స్థానాలు భారీ మెజారిటీతో కైవసం చేసుకోని రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటులో ప్రధాన భూమిక ఖమ్మం జిల్లా నుంచి పోషించడం పట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ క్యాడర్ ను ఉత్తేజపరుస్తూ ఉత్సాహంగా పనిచేసిన జిల్లా వ్యాప్తంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులను సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లోని సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టిపిసిసి సభ్యులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాయల నాగేశ్వరరావు, ఖమ్మం టౌన్ అధ్యక్షులు మహమ్మద్ జావీద్ ల ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో బోనకల్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు ను జిల్లా నాయకులు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావు మాట్లాడుతూ నవంబర్ 30 న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బోనకల్ మండలం నుండి ఉపముఖ్యమంత్రి మధిర శాసనసభ్యులు మల్లు భట్టి విక్రమార్కకు 3700 భారీ మెజార్టీ అందించేందుకు తనకు అన్ని విధాల సహాయ,



సహకారాలు అందిస్తూ తన వెన్నంటి ఉన్న టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్ కి, మండల జడ్పిటిసి సభ్యులు మోదుగు సుధీర్ బాబు, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు, మండల కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల బీసీ, ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులకు, గ్రామ శాఖ అధ్యక్షులకు,యువజన కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, ఓటర్లం దరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు తమ పార్టీపై నమ్మకం ఉంచి భారీ మెజార్టీ అందించడం జరిగిందని వారి ఆశయాల కనుగుణంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.

## కబ్జాకు పాల్పడిన వారిపై ఉక్కుపాదం

- ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా ఉంటాం

-సంక్రాంతి లోగా మరో రెండు గ్యారెంటీ పథకాలు అమలు

- తమ ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వం గా వుంటుంది

-విలేకరుల సమావేశంలో మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి

ఖమ్మం (సూర్య బ్యూరో)
భూకబ్జాలకు పాల్పడే వారిని ఉక్కు పాదంతో తొక్కేస్తామని, ప్రజల ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా ఉంటామని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి అన్నారు. సోమవారం ఖమ్మంలోని నూతన కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాలేరు నియోజకవర్గంలోనే కాదు ఖమ్మం జిల్లాలోని యావత్తు రాష్ట్రంలోనే ఎక్కడ కూడా భూకబ్జాలు జరిగినట్లు ప్రభుత్వ దృష్టికి వస్తే అటువంటి వారిని ఉక్కు పాదంతో అణిచివేస్తామని, గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు, ప్రజా ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, ఇకపై అటువంటి ధోరణి మానుకోవాలని, ప్రభుత్వ సొమ్ముకు ఇందిరమ్మ రాజ్యంలో తాము కాపుల దారులుగా ఉంటామని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు రోజులు నడవక ముందే ప్రతిపక్షాలు కారు కూతలు కూస్తున్నాయని, దేనికైనా ఒక హద్దు ఉంటుందని, తొందరపడితే ప్రయోజనం ఉండదని, తమ ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఉంటుందని, ఎవరిపైన కక్ష సాధింపు ధోరణి ఉండబోదని అన్నారు. ప్రతిపక్ష పార్టీ పొగరుబోతు గిత్తల రంకెలేస్తే చూస్తూ ఊరుకునేది లేదని అటువంటి వారికి తగిన రీతిలో బుద్ధి



చెప్తామని హెచ్చరించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో 6 గ్యారెంటీలను అమలు చేస్తామని, ఇప్పటికే 2 గ్యారెంటీలను అమలు చేశామని, వచ్చే సంక్రాంతి నాటికి మరో 2 గ్యారెంటీలను అమలు చేయబోతున్నామని తెలిపారు. ఈనెల 20 లోగా ప్రజల ముంగిట శ్వేత పత్రం ను ఉంచుతామని, ప్రజాభీష్టం మేరకు ఇందిరమ్మ పాలన కొనసాగుతుందని, శ్వేత పత్రం విడుదల చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు.ఎవరైనా భూ దందాలు ఇసుక దందాలకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే అటువంటి వారిని సహించబోమని గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలను వెలికి తీసి బాధితులకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా అధికారులు తమ విధులు సక్రమంగా నిర్వర్తించాలని ప్రభుత్వానికి అందదండలు అందివ్వాలని విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర మంత్రి పొంగులేటిని కలిసి శాలువా కప్పి సన్మానించిన

### -మాజీ సొసైటీ చైర్మన్ ముత్తినేని వీరయ్య

నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్
మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం,సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని క్యాంపు కార్యాలయంలో కలిసి హార్దిక శుభాకాంక్షలు తెలియజేసి శాలువా కప్పి సన్మానించిన నాచేపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్తినేని వీరయ్య చౌదరి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా నాయకుడు రాష్ట్ర రెవెన్యూ గృహ సమాచార శాఖ మంత్రి పొంగులేటి సామర్థ్యం కలిగిన నాయకుడని ఆయన నాయకత్వంలో రాష్ట్ర ప్రజలకు పాలేరు నియోజకవర్గ ప్రజలకు అనేక మేలులు జరుగుతాయని వెల్లడించారు. మంత్రివర్యులు పొంగులేటి ని కలిసిన వారిలో నాచేపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముండ్రా నాగ ప్రసాద్,సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ మక్తాల రామకృష్ణ,రాయల రమేష్, పచ్చా





జగన్ మోహన్ రావు,మండల యువజన కాంగ్రెస్ నాయకులు యాతా కుల శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# పూలతో ప్రేమగా...!




- శాలువాలు...బొకేలతో శీనన్నకు శుభాకాంక్షలు
- ఉమ్మడి జిల్లా నుంచి తరలొచ్చిన ప్రజానీకం
- జనసందోహంతో కిక్కిరిసిన మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం







**ఖమ్మం సూర్య బ్యూరో:**
ఖమ్మం నగరంలోని ఆయన గుమ్మంలో తొలిసారిగా అడుగుపెట్టిన మంత్రి పొంగులేటికి ఉమ్మడి జిల్లా ప్రజానీకం ఘనస్వాగతం పలికింది. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లాకు విచ్చేసిన శీనన్నకు శాలువాలు, బొకేలతో శుభాకాంక్షలు తెలిపారు. పూల మొక్కలను ప్రేమతో అందించి వారి అభిమానాన్ని చాటుకున్నారు. ఉన్నతస్థాయి వర్గానికి చెందిన వారు మొదలు సామాన్య ప్రజానీకం వరకు ప్రతి ఒక్కరూ శీనన్నను కలిశారు. ప్రతీ ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారు చేసిన చిరు సత్కారాలను స్వీకరించారు. ఉమ్మడి జిల్లా ప్రజల ఆదరాభిమానాలే తనకు ఉన్నత పదవి వరించేలా చేసిందని ఈ సందర్భంగా పొంగులేటి పేర్కొన్నారు. ఉదయం 06.30గంటల నుంచి మొదలైన తాకిడి మధ్యాహ్నం మూడు గంటల వరకు కూడా కొనసాగింది. శీనన్నను కలిసేందుకు వచ్చిన వాహనాలు క్యాంపు కార్యాలయం బయట బారులు తీరాయి.

## ఖమ్మంలో ఘనంగా జిల్లా ఆసుపత్రి డైటిషియన్ డాక్టర్ సూర్యపోగు మేరీ జన్మదిన వేడుకలు..

-సూర్యపోగు మేరీకి పలువురి శుభాకాంక్షలు..
-జిల్లా ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మొక్కను నాటిన సూర్యపోగు మేరీ..
-ఎంపి జోగినేపల్లి ఇచ్చిన పిలుపులో భాగంగా. హరిత తెలంగాణ లక్ష్యం దిశగా.. సూర్యపోగు మేరీ కృషి...




**ఖమ్మం సూర్య మేజర్ న్యూస్..**
ఖమ్మం ప్రభుత్వాసుపత్రి డైటిషియన్ డాక్టర్ సూర్యపోగు మేరీ జన్మదినోత్సనోవాన్ని పురస్కరించుకుని ఖమ్మంలో అమే జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి..తొలుత ఖమ్మం జిల్లా కేంద్రం లోని జిల్లా ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆమె మొక్కను నాటారు. అనంతరం పలు ప్రాంతాల్లో సాయంత్రం చిన్నారులకు మిఠాయిలు పంచారు..ఈ మేరకు పలువురు ప్రభుత్వ వైద్యులు డాక్టర్ దివ్య,వసుమతి, TUWJ TJF ఎలక్ట్రానిక్ మీడియా ఖమ్మం జిల్లా అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ, జర్నలిస్ట్ యస్ కె జానీపాషాలు ఆమెకు బర్త్ డే విషెష్ తెలిపారు... అనంతరం ఆమె మాట్లాడుతూ.... తనపుట్టినరోజు పురస్కరించుకొని రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ ఇచ్చిన పిలుపులో భాగంగా తాను.. ప్రతి అకేషన్ను బట్టి ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటుతూ వస్తున్నానని... తన జన్మ దినిత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటడం జరిగిందని హరిత తెలంగాణ దిశగా తాను కూడా భాగస్వామినీ అవుతానని ఆమె అన్నారు.. డైటిషియన్ డాక్ట ర్ సూర్యపోగు మేరీ బర్త్ డే సందర్భంగా పలు వైద్యాధికారులు, పలువురు వైద్యులు, విద్యావేత్తలు, ప్రముఖులు, ఆమెకు బర్త్డే విషెస్ తెలిపారు..

## పుట్లూరి మల్లారెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేతలు..



**ఖమ్మం సూర్య మేజర్ న్యూస్..**
సోమవారం ఉదయం ఖమ్మం రాపర్తి నగర్ 58వ డివిజన్ నివాసి రిటైర్డ్ లెక్చరర్ పుట్లూరి మల్లారెడ్డి మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లి,పార్థివ దేహాన్ని సందర్శి ంచి,నివాళులు అర్పించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ వీరితో 'పాటు 58వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాలబోయిన వెంకటేశ్వర్లుదుర్గ భవాని మరియు సుంకరి శేఖర్ రెడ్డి,అశోక్ రెడ్డి,హనుమారెడ్డి, కృష్ణారెడ్డి, రామాచారి,రామారావు, రమేష్, రామయ్య తదితరులు డివిజన్ ముఖ్యులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల సంఘ అధ్యక్షునిగా పసుపులేటి



**సత్తుపల్లి సూర్య మేజర్ న్యూస్:-**
సత్తుపల్లి డివిజన్ ప్రైవేటు పాఠశాలల సంఘ అధ్యక్షునిగా స్థానిక విశ్వశాంతి విద్యాలయం కరెస్పాండెంట్ పసుపులేటి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సత్తుపల్లిలో డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక మదర్ తెరిసా స్కూల్లో జరిగింది. కార్యదర్శిగా వలసాల బాలాజీ( బాలాజీ స్కూల్ - కల్లూరు), కోశాధికారిగా చీకటి శ్రీనివాసరావు( గీతాంజలి స్కూల్ - సత్తుపల్లి), ఉపాధ్యక్షులుగా పలగాని ఈశ్వర్( లక్ష్య స్కూల్- పెనుబల్లి), సలహాదారునిగా మంద పాటి ప్రభాకర్ రెడ్డి( కే పి ఆర్ గౌతమ్ మోడల్ స్కూల్- సత్తుపల్లి), సహాయ కార్యదర్శిగా చెన్నారావు( సరస్వతీ స్కూల్ - కందుకూరు) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాల సంఘ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు కాంతారావు, నాయుడు వెంకటేశ ్వరరావు, నాసరయ్య ,సంఘ జిల్లా బాధ్యులు లక్కినేని ప్రసాద్, ఇస్మాయిల్, నాగేందర్ రెడ్డి,భగవాన్ రెడ్డి,పులి శ్రీనివాసరావు,సత్తుపల్లి డివిజన్ లోని ప్రైవేట్ పాఠశాలల యజమానులు పాల్గొన్నారు.

## రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు

### -తెలియ చేసిన టీఎన్జీఓ సంఘం



**ఖమ్మం సూర్య మేజర్ న్యూస్..**
రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణం... సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొంగులేటి శ్రీనివాసరెడ్డిని తొలిసారిగా ఖమ్మం ఐడిఓసి కి జిల్లా అధికారుల సమీక్ష సమావేశం కొరకు వచ్చిన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియ చేసినారు ...ఈసం దర్భంగా టీఎన్జీఓ యూనియన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు షేక్.అఫ్జల్ హసన్,ఆర్.వి.ఎస్. సాగర్ ల పిలుపు మేరకు టీఎన్జీఓ యూనియన్ బాధ్యులు పెద్ద సంఖ్యలో హాజరయిన ఉద్యోగులతో కలిసి అఫ్జల్ హసన్ మర్యాదపూర్వకంగా రెవెన్యూ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి,శాలువతో సత్కరించి అభినందనలు తెలియ జేశారు. ఈసందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు.ప్రభుత్వం ఉద్యోగులతో స్నేహపూర్వక సంబంధంను కొనసాగిస్తోందన్నారు.ఉద్యోగుల పక్షాన వెన్నంటి ఉంటోందని స్పష్టం చేశారు. ప్రజారంజక పాలనను అందించడంలో ఉద్యోగులు తమ భాగస్వామ్యాన్ని కలిగి ఉండాలని కోరారు.మంత్రి గారిని కలిసిన వారిలో టీఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు నందగిరి శ్రీను,రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్. ప్రసాద్ రావు,టౌన్ అధ్యక్షులు నాగుల్ మీరా, కార్యదర్శి కట్టా నవీన్ ,రూరల్, వైరా,కల్లూరు యూనిట్ ల అధ్యక్ష కార్యదర్శులు వెంకటరెడ్డి,శివ స్వప్న,సవర్జన్ పాల్,ప్రసాద్ ,రాజేష్ ,నరేష్ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ , వై.శ్రీనివాసరావు,పాషా,మహిళవిభాగం జిల్లా అధ్యక్షురాలు శాబాసు జ్యోతి, కార్యదర్శి ఏ స్వప్న ,ఉపాధ్యక్షురాలు ఎ.జ్యోతి,శాంత కుమారి ,స్వర్ణ లతా ,మెడికల్ ఫోరమ్ అధ్యక్షులు బుద్దా రామకృష్ణ,వలి ,డీఈ ఓ ఫోరమ్ అధ్యక్షులు యూసఫ్ అహ్మద్ ,చావ శ్రీనివాసరావు,హాస్పిటల్ ఫోరమ్ హబీబ్,లింగరాజు ల్యాండ్ రికార్డు ఫోరమ్ మురళి, ఉపేందర్, ఇరిగేషన్ మయింటెనెన్స్ ఫోరం అధ్యక్షులు వెంకటి,కార్యదర్శి రమణారెడ్డి ,వెటర్నరీ సత్యనారాయణ ,ఆడిట్ జ్వల నర్సింహారావు ,అన్ని ఫోరమ్ ల బాధ్యులు ,టౌన్ బాధ్యులు, దేవేందర్, రామారావు, రచన ,శ్రీదేవి,జిలాని,వెంకటేశ్వర్లు,నంద కిశోర్,రెహ్మాన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి కళ్యాణం





**అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్)** – మండల పరిధిలోని పెంట్లం పంచాయతీ నామవరం గ్రామంలో వెంచేసి ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత యోగేశ్వర ఆలయానికి ఉప ఆలయంగా ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సుబ్రమణ్య షష్టి నీ పురస్కరించుకొని స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. శ్రీవల్లి దేవసేనతో సుబ్రమణ్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు తేరళ వెంకట శివరామకృష్ణమూర్తి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ కళ్యాణ ప్రాముఖ్యత, వ్యాఖ్యానం చేస్తూ జరిపించారు. స్వామివారి కల్యాణాన్ని వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు సుధీర ప్రాంతాల నుండి సైతం భక్తులు విచ్చేశారు .స్వామి వారి కళ్యాణం అనంతరం తలంబ్రాల బియ్యం తీసుకునే మహిళలకు సంతాన ప్రాప్తి, కన్యలకు కళ్యాణ ప్రాప్తి జరుగుతోందని విశ్వాసంతో తలంబ్రాలు ఒడిలో తీసుకోవడానికి మహిళ భక్తులు పోటెత్తారు. అనంతరం ఆలయ కమిటీ మహాప్రసాద, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారికి పుష్పాలంకరణ, మంగళహారతి, ఉయ్యాల సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

# త్వరలోనే వెంగళరావు ప్రాజెక్టు అలుగు నిర్మాణ పనులు చేపడుతాం

**– తెగిపోయిన ప్రాజెక్ట్ అలుగు పరిశీలించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**



చంద్రుగుండ,సూర్య (మేజర్ న్యూస్ )– త్వరలోనే వెంగళరావు ప్రాజెక్ట్ అలుగు నిర్మాణ పనులను చేపడుతామని అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం మండల పర్యటనలో భాగంగా సీతాయిగూడెం గ్రామంలోని వెంగళరావు ప్రాజెక్టు అలుగును రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల అసెంబ్లీ సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రికి స్వయంగా వెంగళరావు ప్రాజెక్టు గురించి వివరించడం జరిగిందన్నారు. మంత్రి కూడా సానుకూలంగా స్పందించి నిర్మాణానికి కావాల్సిన ఎస్టిమేషన్ తయారుచేసి పంపించాలని ఆ శాఖ అధికారులకు కూడా ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే వెంగళరావు ప్రాజెక్టు గురించి ప్రస్తావించడం జరిగిందన్నారు. అలాగే అలుగు నిర్మానం అయ్యేంతవరకు రైతులకు సాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు బిఆర్ఎస్ ప్రభుత్వంలో అలుగు తేగిపోయి నాలుగు సంవత్సరాలు అవుతున్న కనీసం అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గాని ఎవరూ పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నైనా వెంటనే ప్రతిపాదనలు పంపి అలుగు నిర్మాణం చేపట్టాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి సర్పంచ్లు పద్దం వినోద్, కీసరి శాంతమ్మ, మండల నాయకులు మాలోత్ బోజ్యా నాయక్, సారేపల్లి శేఖర్, ఉప్పతల ఏడుకొండలు, నల్లమోతు రమణ, పొన్నెబోయిన బిక్షమయ్య, గానుగపాడు సొసైటీ చైర్మన్ చెవుల చందర్ రావు, శంకర్ , కాశీ , సురేష్, ఫజల్ బక్స్, కృష్ణవేణి, విజయలక్ష్మి, రుక్మిణి, సిపిఐ మండల కార్యదర్శి బొర్రా కేశవరావు, టిడిపి మండల అధ్యక్షుడు వారాధి సత్యనారాయణ, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

# మైనార్టీ హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

**–మైనార్టీ జిల్లా అధ్య క్షులు ఎండీ యాకూబ్ పాషా**



కొత్తగూడెం టౌన్ ,సూర్య (మేజర్ న్యూస్ )– రాజ్యాంగ పరంగా మైనారిటీలకు సంతరించిన హక్కులను కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు కాల రాస్తున్నాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ అధ్యక్షులు యండి. యాకూబ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన జాతీయ మైనారిటీ హక్కుల దినోత్సవమును పురస్కరించుకొని సోమవారం నాడు సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెమినార్ లో ల్ మాట్లాడుతూ... ఐక్యరాజ్య సమితి 1992 లో డిసెంబర్ 18న మైనారిటీ హక్కుల దినోత్సవంగా ప్రకటించిందని, దేశ వ్యాప్తంగా మైనార్టీ హక్కుల గురించి అవగాహన కల్పించాల్సిన బాధ్యత కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నప్పటికి అట్టి బాధ్యతలను తుంగలో తొక్కుతున్నారని అన్నారు. మైనారిటీలకు ఉన్నత విద్యలను ప్రోత్సహించాలని 2009 లో యూపీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మౌలానా ఆజాద్ జాతీయ ఫెలోషిప్ ను కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందని, మైనారిటీ విద్యార్థులకు అందించే ప్రీ–మెట్రిక్ ఉపకార వేతనాలను కూడా రద్దు చేసి విద్యాపరంగా మైనారిటీలను అనగదొక్కాలని కుట్ర పన్నుతున్నారని అన్నారు. దేశ జనాభాలో 14.3% మంది ముస్లిం జనాభా ఉండగా, జనాభా నిష్పత్తి ప్రకారం లోక్‌సభలో ముస్లింలకు 74 సీట్లు ఉండాలి కానీ 27 మంది ముస్లిం ఎంపీగా ఉన్నారని, దేశం లోని 28 రాష్టాలో ఒక్క ముస్లిం ముఖ్యమంత్రి కూడా లేరని, 2014లో, 2019లో లోక్ సభకు ఒక్క ముస్లిం ఎంపీ ని కూడా బీజేపీ ఎన్నుకోలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో డిసెంబర్ లో జరిగిన ఎన్నికల్లో ఎంఐఎంలో తప్ప ఏ ఇతర పార్టీల నుంచి ఒక్క ముస్లిం ఎమ్మెల్యేలు కూడా ఎన్నిక కాలేదని అన్నారు . ముస్లింలు తమ హక్కుల కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎండీ. షకీల్, జాకీర్ హుస్సేన్ , అక్బర్, అలీం, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకోసం సమిష్టిగా పనిచేద్దాం

**–ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**కొత్తగూడెం ,సూర్య (మేజర్ న్యూస్)** – శాంతి భద్రద్రతలు కాపాడడంకోసం, ప్రజా సమస్యల పరిస్కారంకోసం సమిష్టిగా పనిచేద్దమని, అధికార యంత్రంగం, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కొత్తగూడెం శాసనసభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరా అన్నారు. సోమవారం తన నివాసంలో కొత్తగూడెం షబ్ డివిజనల్ పొలిసు అధికారి అబ్దుల్ రహమాన్, పలువురు సిఐలు, ఎస్సైలు కూనంనేనిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ ఛైర్పర్సర్ కాపు సీతా లక్ష్మి, పలువురు కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిదులు కూనంనేని పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా పనిచేస్తేనే సమస్యలకు పరిస్కారం లభిస్తుందని అన్నారు. సమస్యలపై స్పందింస్తూ త్వరితగతిన పరిష్కరించేందులు అధికారులు, ప్రజా ప్రతినిధులు భాద్యతగా తీసుకోవాలని కోరారు, తనకు అభినందనలు తెలిపిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య, కంచర్ల జమలయ్య, కె రత్నకుమారి తదితరులు ఉన్నారు.

## శివాలయంలో అన్నదానం



అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్) – మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో సోమవారం సుబ్రమణ్య షష్టిని పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, గోత్రనామర్చనలు నిర్వహించారు. స్వామివారిని ఎంపీడీవో అన్నపూర్ణ, సర్పంచ్ పద్మ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని అన్నపురెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి ఖాదర్ మియా, మస్తాన్ బి, పెంట్లం పంచాయితీ కార్యదర్శి ఎన్ రమేష్– స్వరూప దంపతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసే సోమవారం అన్నదాన కార్యక్రమానికి అన్నదాతలుగా పాల్గొనదలచిన భక్తులు ఆలయ సిబ్బంది సెల్ నెం 9959108107 ను సంప్రదించాలని కోరారు.

## ఎంపీటీసీ నరేష్ అధ్వర్యంలో అనగాశ్రీకు ఘన సన్మానం

అశ్వాపురం, సూర్య(మేజర్ న్యూస్) – మండల పరిధిలోని మొండికుంట కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో స్థానిక ఎంపిటిసి కమటం నరేష్ అధ్వర్యంలో మల్లెల మడుగు గ్రామానికి చెందిన అదే గ్రామం జిల్లా పరిషత్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బచ్చలకూరి అనగాశ్రీ ఈ నెల 13.14.15తేదీలలో మహబూబు నగర్ జిల్లాలో జరిగిన అండర్ –14 వాలీబాల్ పోటీలలో ఉమ్మడి ఖమ్మం జిల్లా తరుపున పాల్గొని రన్నర్ గా తిరిగి వచ్చిన సందర్భంగా ఘన సన్మానం తో పాటు నగదును పారితోషికంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతోపాటు చదువులో కూడా ముందుండి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి, మండలానికి, పేరు ప్రతిష్టలు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో. మొండికుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు .



# 10 సంవత్సరాలలో అమలుపరచని వాగ్దానాలు పది రోజుల్లో సాధ్యమా...?

**- బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేలు మతిభ్రమించి మాట్లాడుతున్నారు.**
**- శాసనసభ వేదికగా ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని హితవు.**
**- పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశాల రామనాథం.**



**పినపాక సూర్య (మేజర్ న్యూస్)**–తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయ దంక మోగించిన తర్వాత జరుగుతున్న తొలి శాసనసభ సమావేశాలలో ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి వాడి వేడి మాటలు యుద్ధం కొనసాగుతుంది .గత నాలుగు రోజులుగా కాంగ్రెస్ ప్రభుత్వం పై కేటీఆర్ చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడిశాల రామనాథం బయ్యారం క్రాస్ రోడ్ నందు పార్టీ ఆఫీసులో పాత్రికేయుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బి ఆర్ ఎస్ ప్రభుత్వం పాలించిన పది సంవత్సరాలలో ప్రకటించిన హామీలు అమలుపరచని వాగ్దానాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేస్తుంటే జీర్ణించుకోలేక గత ప్రభుత్వ పాలకులు మాజీ మంత్రి కేటీఆర్ ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితులలో మతిభ్రమించి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారానికి దూరమవుతామని తెలిసినా కూడా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను, ఆకాంక్షను దృష్టిలో ఉంచుకొని సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలు టిఆర్ఎస్ పాలనతో విసుగు చెందారని అవినీతి పాలన అంతమొందించాలని కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టుమని పది రోజులు పూర్తికాకుండానే గత ప్రభుత్వంలో చేసిన పనుల గురించి చర్చా వేదికగా చర్చించవలసిన విషయాలను పక్కనపెట్టి ప్రతిపక్ష నాయకులు 50 సంవత్సరాల చరిత్ర చెబుతానని పక్కదోవ పట్టిస్తున్న కేటీఆర్, హరీష్ రావు ఇటువంటి ధోరణి మానుకొని అసెంబ్లీ సమావేశంలో ప్రజల సమస్యలపై సమయాన్ని కేటాయించి ప్రజలకు ఉపయోగపడేలా నడుచుకోవాలని అన్నారు. 2014 సంవత్సరం నుండి 2023 వరకు మీరు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటైనా పూర్తిస్థాయిలో అమలు చేసిన దాఖలాలు లేవని , ఇచ్చిన హామీలలో దళితునికి ముఖ్యమంత్రి పదవి, దళితులకు మూడు ఎకరాలు, ప్రజలకు రేషన్ కార్డులు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు , ఆరోగ్యశ్రీ వుసే లేదు, నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం ఊసే లేదు, ఒకేసారి రుణమాఫీ చేస్తానని వాయిదాల వారీగా రుణమాఫీ చేస్తూ ప్రతి సంవత్సరం వడ్డీ రూపంలో రైతుల నడ్డి విరగొట్టిన మీకు పథకాలను ప్రకటించటం ఆపై అటకెక్కించటం వీటన్నిటిని గమనించిన తెలంగాణ రాష్ట్ర ప్రజలు సమయం చూసి తగిన బుద్ధి చెప్పి అధికారానికి దూరం చేసినా కూడా మీ పరిస్థితిలో మార్పు రాలేదని అన్నారు. ఇకనైనా ప్రతిపక్ష నాయకులు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకొని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి అసెంబ్లీ వేదికగా రాష్ట్ర ప్రజల సమస్యలపై న్యాయం చేసే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరించి తమ విధేయతను చాటుకోవాలని సూచించారు.

# అర్హులైన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలి

**-గిరిజన దర్బార్ కు వచ్చిన దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలి**
**-పతి గిరిజన కుటుంబానికి న్యాయం జరిగేలాగా అధికారులు జవాబుదారీగా ఉండాలి.**
**౦ భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్.**



భద్రాచలం సూర్య (మేజర్ న్యూస్)– రోజు, రోజుకు చలి తీవ్ర త పెరగడం తో ఆశ్రమ పాఠశాల, గురుకులాలలో చదివే విద్యార్థిని, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారి ఆరోగ్య స్థితిగతులు ఎప్పటికప్పుడు సంబంధిత ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.

సోమవారం ఐటిడిఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో దూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుండి ఆయన యూనిట్ అధికారుల సమక్షంలో అర్జీలు స్వీకరించి తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి, మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ వీలైనంత తొందరగా అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలాగా చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు... గిరిజన దర్బార్ లో సమర్పించిన అర్జీలలో పోడు భూముల పట్టాల కొరకు, పట్టాలలో పేర్లు మార్పు కొరకు, రైతుబంధు రుణాల కొరకు, వ్యక్తిగత సమస్యలు, భూ సమస్యల పై ,చదువులు చదవడానికి ఆర్థిక సహాయం కొరకు, గిరిజన గ్రామాలలో వ్యవసాయం చేసుకోవడానికి కరెంటు, బోరు, మోటారు కొరకు , మారుమూల గిరిజన గ్రామాలలో మంచినీటి సౌకర్యం కల్పించుట కొరకు, నూతనంగా మత్స్యకార సొసైటీలు ఏర్పాటు చేసుకొనుట కొరకు, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం కొరకు, స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవడానికి వృత్తి శిక్షణలు ఇప్పించుట కొరకు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు కొరకు గిరిజనుల నుండి అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ ,ఎస్ఓ సురేష్ బాబు, ఏడి అగ్రికల్చర్ భాస్కరన్, డిటి ఆర్ ఓఎఫ్ ఆర్ శ్రీనివాస్, ఏపీవో పవర్ మునీర్ పాషా, ఉద్యానవనాధికారి అశోక్ కుమార్ ,మేనేజర్ ఆదినారాయణ, ఏవో గురుకులం నరేందర్, డిఈ హరీష్, సిబ్బంది నాగభూషణం, సుగుణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అభీష్టం మేరికే పనిచేస్తాం

**ఖమ్మం సూర్య బ్యూరో**

ఎన్నికల సమయంలో తుమ్మల గెలుపు కొరకు ప్రచారంలో భాగంగా ఖమ్మం నియోజకవర్గం లోని ప్రజల సమస్యలను తెలుసుకుంటూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా సమస్యలను తీరుస్తామని మాట ఇచ్చినట్టుగా. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను తుమ్మల గెలుపు కొరకై కృషిచేసిన నాయకులను ఒక్కొక్కరిగా కలుస్తూ ధన్యవాదాలు తెలుపుతూ. ప్రజా సమస్యలపై దృష్టి సాధిస్తున్నారు.

ఎన్నికల సమయంలో వన్ టౌన్ 3 టౌన్ ప్రాంతాల ప్రజల ముఖ్య సమస్య అయినటువంటి.



దూర ప్రాంతాల నుండి రాత్రివేళలా బైపాస్ రోడ్ లోని కొత్త బస్టాండ్ నుండి త్రీ టౌన్ ప్రాంత ప్రకాష్ నగర్,శ్రీనివాస్ నగర్, గ్రీన్ మార్కెట్ , వన్ టౌన్ ప్రాంత, చర్చి కాంపౌండ్, ముస్తఫా నగర్, దంసలాపురం ప్రాంతాలవారికి చార్జీల రూపన అదనపు భారం పడుతుందని ఆ ప్రాంత ప్రజలు ఎన్నికల సమయంలో పేర్కొనడంతో.ఆ సమస్య దృష్టిలో ఉంచుకొని డాక్టర్ తుమ్మల యుగంధర్ లి రాత్రి వేళలో దూర ప్రాంతాల నుండి వచ్చే సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ లగ్జరీ బస్సులను పాత బస్టాండ్ మీదుగా నడపాలని ఆర్టీసీ ఉన్నత అధికారులకు కోరడంతో వారు సానుకూలంగా స్పందించి అతి త్వరలో ఈ సమస్య పై చర్చించి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని అన్నారు.

## ఆత్మీయ నేత కూనంనేనికి స్వాగతించిన రేగళ్ల ఉమ్మడి పంచాయతీ గిరిజనులు

**–గుగులోత్ రూప్లా ఆధ్వర్యంలో ఘన సన్మానం**





లక్ష్మీదేవిపల్లి ,సూర్య (మేజర్ న్యూస్ )– ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన సిపిఐ నేత కొత్తగూడెం ఎమ్మెల్యే కూ నం నేని సాంబశివరావుకి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని లక్ష్మీదేవి పెల్లి మండలంలో ఉన్న రెగళ్ళ ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలో గిరిజనులు ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం వారి సమస్యల సాధన కోసం స్వార్థం వీడి పోరాటం చేసే మహా వ్యక్తి ఎమ్మెల్యే కూనంనేని అని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడమే కాకుండా స్థానికంగా ఉంటూ ప్రజా సమస్యల పోరాటానికి ముందుండేవాడని అనునిత్యం స్థానికంగానే ఉంటూ గ్రామాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తారని నమ్మకంతో గిరిజనులు రేగళ్ల ఉమ్మడి ప్రాంతంలో అత్యధిక ఓట్లేసి మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేశామని అన్నారు. రేగళ్ల ఉమ్మడి పంచాయతీలో దీర్ఘకాలికంగా ఉన్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయిస్తారని ఆశతో ఉన్నామని ఈ పంచాయతీలో కొంతమంది స్వార్థంగా తన అనుకున్న వారికే పట్టాలు మంజూరు చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. ఎమ్మెల్యే కూనంనేని దయతో అర్హులైన ప్రతి ఒక్క గిరిజనులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో రేగళ్ల పెద్ద తండా కాంగ్రెస్ నాయకులు భూక్య కిషన్ ధారావత్ దుగ్లో, జాటోత్ దంజి బావ్ సింగ్, భూక్య లచ్చిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఎంపిటిసి వేముల భారతి

**పలు సమస్యలపై జారెకు వినతి**

అశ్వారావుపేట సూర్య, (మేజర్న్యూస్)–అశ్వారావుపేట సెంట్రల్ లైటింగ్ పనులు వేగవంతం చేసి ప్రజల, వ్యాపారుల ఇబ్బందులు తొలగించాలని ఎంపిటిసి వేముల భారతి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కోరారు. సోమవారం ఎమ్మెల్యే స్వగ్రామం గండుగులపల్లిలో జారెను కలుసుకున్న భారతి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి పేరుతో అరాకురా పనులతో ఎక్కడి వేసిన గొంగళి వలే పనులు సాగాయన్నారు. ప్రజలను సైతం నొప్పించేలా పాలనను నడిపినటువంటి టిఆర్ఎస్ ప్రభుత్వా నికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అందులో భాగంగానే అశ్వారావుపేట సెంట్రర్ లైటింగ్ అని రోడ్డుకి ఇరువైపులా గుంతలు తవ్వి వ్యాపారస్తులకు, ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించారని అన్నారు. ఈ సెంట్రల్ లైటింగ్ ప్రక్రియ ను కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా తక్షణమే పూర్తి చేసి ప్రజలకు మేలు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా మన ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో భాగంగా మహాలక్ష్మి పథకం ఎందరో నిరుపేదలకు చిరు ఉద్యోగులకు సైతం ఎంతో ఆసరాగా నిలబడి మహిళల ముఖంలో ఆనందాన్ని నింపుతుందని అన్నారు. అయితే ఈ పథకం ద్వారా కొంతవరకు ఆటో వాళ్లకు నష్టం చేకూరుతుందని ఆటోని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న కుటుంబాలకు భరోసా కల్పించేలా అసెంబ్లీలో వారి గోడు వినిపించాలని ఎమ్మెల్యేను భారతి కోరారు.



# మున్సిపల్ కాంప్లెక్స్,వెండర్ జోన్ గదులను పరిశీలించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య





ఇల్లందు టౌన్, సూర్య( మేజర్ న్యూస్) – పట్టణ పరిధిలోని మెయిన్ రోడ్ హై స్కూల్ ప్రహరీ గోడకు అనుకొని ఉన్న 26 గదుల కాంప్లెక్స్ ను, మెయిన్ రోడ్ హై స్కూల్ ఎదురుగా ఉన్న వెండర్ జోన్ లో గల 34షాపింగ్ గదులలో వ్యాపారం కోసం అని కిరాయి తీసుకున్న వారు వ్యాపారం చేస్తున్నారా మరొకరికి కిరాయికి ఇచ్చారా అనే విషయాలను తెలుసుకోవడం కోసం సోమవారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపారం కోసమని తీసుకున్నవారు వ్యాపారం చేయాలని కొంతమంది అందులో వ్యాపారం చేయకుండా వేరేవారికి అధిక మొత్తానికి కిరాయిస్తున్నారని ఆరోపణలు వచ్చాయని తెలిపారు. వెండర్ జోన్ కాంప్లెక్స్ లను, కాంప్లెక్స్ గదులను తనిఖీ చేసిన షట్టర్ వేసి ఉన్న కిరాయి దారులకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. మెయిన్ రోడ్ హై స్కూల్ ఎదురుగా ఉన్న వెండర్ జోన్ లో ను,సీతారామ థియేటర్ ఎదురుగా ఉన్న హై స్కూల్ ఆనుకుని నిర్మించబడ్డ గదులలో ఒక గది ఒకరికి మాత్రమే వ్యాపారం చేసుకోవడానికి కిరాయికి ఇచ్చామని, వ్యాపారము చేయలేని వారు వేరే వారికి కిరాయికి ఇవ్వకూడదని తెలిపారు. గౌరవప్రదంగా వ్యాపారం చేసుకునేందుకు గదులు నిర్మించి ఇచ్చామని వాటిని దుర్వినియోగ పరచవద్దని అని వారు కోరారు. మున్సిపల్ పాలకవర్గం నిర్మించిన గదులకు కిరాయి ని మున్సిపల్ కార్యాలయంలో చెల్లించాలె తప్ప వేరే వారికి ఎట్టి పరిస్థితుల్లో చెల్లించకూడదని పేర్కొన్నారు. మెయిన్ రోడ్ హైస్కూల్ కాంప్లెక్స్ గదుల లోనూ వెండర్ జోన్ గదులకు సంబంధించి దర్యాప్తు చేసి పూర్తి వివరాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్యాలయ మేనేజర్ అంకుషావలి, మున్సిపల్ ఆర్ ఐ శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్ అంకెపాక నవీన్ కుమార్, పత్తి రంజిత్, మొగిలిఈశ్వర్, జూనియర్ అసిస్టెంట్ బంపర్, మున్సిపల్ చైర్మన్ పిఎ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయించే సూర్యుడు గుర్తుకు ఓటు వేయండి

**– సీఐటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి. రాజారావు**



ఇల్లందు టౌన్,సూర్య (మేజర్ న్యూస్) – ఈనెల 27న జరిగే సింగరేణి కాలరీస్ గుర్తింపు సంఘఎన్నికలలో సీఐటీయూ యూనియన్ ఉదయించే సూర్యుడి గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని సిఐటియు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఆల్ ఇండియా నాయకులు పి. రాజారావు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. సింగరేణి ఎస్ అండ్ పీ సీ ఆఫీసు లో సోమవారం జరిగిన పిట్ మీటింగ్ లో సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పీ. రాజా రావు సెక్యూరిటీ సిబ్బంది నీ ఉద్దేశించి మాట్లాడుతు నీతి నిజాయితీ కి మారు పేరైన సీఐటీయూ కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.కార్మికులకు సొంతింటి కళ నెరవేరాలంటే, సింగరేణి సంస్థను కాపాడాలంటే సీఐటీయూ గుర్తు ఉదయించే సూర్యుడు గుర్తుకు ఓటు వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ నబి, అబ్బాస్, కోసూరి రమేష్, కే శంకర్,తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్ కుమార్, దారవత్ రాందాస్, హుస్సేన్, గోబ్రియా, వైఖుంటం, కేశవ్ శ్యామ్ లోధ్ సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

## 108 వాహనాన్ని తనిఖీ చేసిన జిల్లా కోఆర్డినేటర్..



**అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్) –** అంబులెన్స్ వాహనాన్ని సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో ప్రజలకు సేవలందిస్తున్న 108 అంబులెన్స్ వాహనాన్ని తనిఖీ చేసి వాహనాలు అందుబాటులో ఉన్న వివిధ రకాల ఔషధాలు, వాహనానికి అమర్చి ఉన్న పరికరాల పనితీరును, రికార్డుల నిర్వహణను, వాహనాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న 108 వాహనాన్ని సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ముఖ్యంగా ప్రతి కేసు పూర్తయిన తర్వాత యధావిధిగా లిక్విడ్ ద్రావణంతో శుభ్రం చేసుకోవాలని తెలిపారు. మండలంలో విధులు నిర్వహిస్తున్న 108 సిబ్బంది చాలా చురుగ్గా పనిచేయడం అభినందనీయమని, అదేవిధంగా ప్రజలకు ఎప్పటికప్పుడు 108 వాహనాన్ని అందుబాటులో ఉంచుతూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండకుండా ఉన్నతాధికారులు సూచించిన విధంగా రికార్డుల నిర్వహణ ఉండాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా 108 వాహనాలు 22 ఉన్నాయని, వాహనాల పనితీరు పరికరాలు, ఔషధాలు, రికార్డులను ప్రతి మూడు నెలలకో ఒకసారి తనిఖీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ ఫకీర్ దాస్ 108 సిబ్బంది ఈఎంటి కళాధర్, ఫైలెట్ రాజా, తదితరులు పాల్గొన్నారు.

## త్రివేణిలో ఘనంగా తానా అమ్మా నాన్న గురువు పద్యార్చన

లక్ష్మీదేవిపల్లి, సూర్య(మేజర్న్యూస్) – స్థానిక లక్ష్మీదేవిపల్లిలో గల త్రివేణి పాఠశాలలో తానా అమ్మా నాన్న గురువు పద్యార్చన కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఉత్తర అమెరిక తెలుగు సంఘం తానా , వంద దేశాలల్లో ఉన్న వందకు పైగా తెలుగు సంఘాల సమన్వయంతో వందే విశ్వమాతరమ్ పేరుతో చిగురుమళ్ళ శ్రీనివాస్ వంద దేశాలల్లో నిర్వహిస్తున్న శాంతి సద్భావన యాత్రలో భాగంగా తానా అమ్మ నాన్న గురువు శతక పద్యార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తానా అధ్యక్షులు నిరంజన్ శృంగవరపు, తానా పూర్వ అధ్యక్షులు జయశేఖర్ తాళ్ళూరి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 10 లక్షల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.దీనిలో భాగంగా త్రివేణి స్కూల్ విద్యార్థులు చిగురుమళ్ళ శ్రీనివాస్ రచించిన అమ్మశతకం, నాన్నశతకం, గురువు శతకాలలోని పద్యాలను కంఠస్థం చేసి 650 మంది సామూహిక గానం చేశారు. ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులకు పెద్దల పట్ల గౌరవం పెంచడానికి ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. త్రివేణి స్కూల్ విద్యార్థులు చిగురుమళ్ళ శ్రీనివాస్ రచించిన అమ్మశతకం, నాన్నశతకం, గురువు శతకాలలోని పద్యాలను కంఠస్థం చేసి 650 మంది సామూహిక గానం చేశారు. ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులకు పెద్దల పట్ల గౌరవం పెంచడానికి ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఉపాధ్యాయులు వై.వి.సురేష్, శ్రీనివాస్ సింగ్,సౌజన్యలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గొల్లపూడి డైరెక్టర్స్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి గొల్లపూడి జగదీశ్, సి.ఆర్.ఓ. కాట్రగడ్డ మురళీ కృష్ణ, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్ సింగ్, వై.వి. సురేష్ , వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య పాల్గొన్నారు.



## అధికారులు చర్యలు చేపట్టాలి

**–ప్రజా దర్బార్ లో అదనపు కలెక్టర్ డాక్టర్.పి. రాంబాబు**



కొత్తగూడెం కలెక్టరేట్ ,సూర్య ( మేజర్ న్యూస్ )– ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ డాక్టర్.పి. రాంబాబు తెలిపారు. సోమవారం ఐ డి ఓ సి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజా దర్బార్ నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అందజేసిన దరఖాస్తులపై తీసుకున్న చర్యలపై నివేదికలు అందజేయాలని చెప్పారు. దరఖాస్తులను ఎ%శీ%డర్స్మెంట్ చేసి ఆయా శాఖల అధికారులకు తగు చర్యల నిమిత్తం సిఫార్సు చేసినట్టు చెప్పారు. పాల్వంచ మండలం ఒడ్డుగూడెం గ్రామస్తురాలు కే ధనలక్ష్మి.తనకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కాకర్ల రెవెన్యూ గ్రామము లో 1-34 కుంటల వారసతో పట్టా భూమి కలదని, అట్టి భూమికి రెవెన్యూ శాఖ భూమి రికార్డుల ప్రకారము 1-బి నమూనా (ఆర్ ఓ ఆర్ ) కూడా వచ్చినదని, 2020 లోనే తనకు పట్టా కావాల్సి ఉన్నదని, కానీ అనారోగ్య కారణాలవల్ల తాను పట్టా చేయించుకోలేకపోయినానని, దయతో తనకు టి ఎస్ పట్టాదారు పాస్ బుక్ ఇవ్వాల్సిందిగా కోరారు . మూడ్ లచ్చు పెద్ద తండ మాచినపేట జూలూరుపాడు మండలం వాస్తవ్యులు తాను వికలాంగుడనని, బ్లడ్ క్యాన్సర్ తో పోరాడుతున్నానని, బిఏ, బిఈడి చదివి ఉన్నానని, ఎటువంటి ఉద్యోగం రాక ఇబ్బందులు పడుతున్నానని, తనకు వికలాంగుల కోట కింద అంత్యోదయ కార్డు మంజూరు చేయవలెనని కోరారు . ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రవీంద్రనాథ్, డి ఆర్ డి ఓ మధుసూదన్ రాజు, అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పదవీ బాధ్యతలు స్వీకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**–శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు**



కొత్తగూడెం,సూర్య(మేజర్ న్యూస్) – బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన టీఎస్ఆర్టీసీ, రవాణా శాఖకు సంబంధించిన మూడు ఫైళ్లపై సంతకం చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరం 3వ త్రైమాసికానికి బస్‌పాస్‌లకు రాయితీల ఖర్చు రీయింబర్స్‌మెంట్ కోసం రూ 212.50 కోట్లను విడుదల చేస్తూ ఫైలుపై సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ని కలసిన టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు శాలువ కప్పి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాజమౌళి, ఏఐఎస్ఎఫ్ కేంద్ర కమిటీ వైస్ ప్రెసిడెంట్ స్టాలిన్, యువజన కాంగ్రెస్ నాయకులు మెట్టెల సైదుబాబు, గుడిచుట్టు గోపి, సాయి ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

# జనం మెచ్చిన నాయకుడు జావిద్

**క్యాడర్ కు వెన్నుదన్నుగా పార్టీ కార్యక్రమాల నిర్వహణ లో చురుకైన పాత్ర**

**సముచిత స్థానం కల్పించాలని అనుచరుల ఆకాంక్ష**



**ఖమ్మం సూర్య (మేజర్ న్యూస్)**

యువత నిర్ణయించిన ప్రభుత్వం కాంగ్రెస్ అయితే ఖమ్మం నియోజకవర్గ పరిధిలో కుల మతాలకు అతీతంగా యువత మెచ్చిన నాయకుడు మహమ్మద్ జావిద్ . ఖమ్మం గడ్డ కాంగ్రెస్ కు కంచుకోట. ఇక్కడ ప్రతి కార్యకర్త ను జావిద్ పెద్దన్న లా చూసుకుంటారన్న నమ్మకం కేడర్ లో వుంది.కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు లో గానీ హాత్ సే హాత్ జోడో కార్యక్రమం లోగానీ, నాటి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర లో గానీ జావిద్ విశేష పాత్ర పోషించారు . పార్టీ లోకీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , తుమ్మల నాగేశ్వరరావు ల చేరిక కు ముందు క్యాడర్ కు వెన్ను దన్ను గా నిలిచి పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలో విశేష కృషి చేశారు . గడప గడపకు కాంగ్రెస్ ఇంకా 6 గ్యారంటీ లను ఇంటింటికి చేరవేయడంలో ఇతోధికం గా కృషి చేశారు .కేసులకు బెదరలేదు. తన సర్వస్వము పార్టీ కి ధారపోసి క్యాడర్ ను నిలబెట్టారు.జావిద్ కాంగ్రెస్ పార్టీ కష్ట కాలంలో అండగా నిలిచారు . ఖమ్మంలో పార్టీని నిలబెట్టి ప్రతి కార్యకర్తకు అండగా నిలబడి పార్టీ కోసం తొమ్మిదేళ్లుగా కొట్లాడారు. ఖచ్చితంగా ఖమ్మం టికెట్ తనకే దక్కుతుందని అన్ని సర్వే లు చెప్పాయి. టికెట్ దక్కిందనే అనుకునే టైంలో చివరి నిమిషంలో తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ లో జాయిన్ కావడంతో కాంగ్రెస్ అధిష్టానం ఖమ్మం టికెట్ తుమ్మల కి కేటాయించింది. దీంతో జావీద్ కు టికెట్ దక్కలేదు. తన టికెట్ ను త్యాగం చేసి పార్టీ పెద్దలను గౌరవించి పార్టీ నిర్ణయానికి విధేయుడై ఖమ్మంలో తుమ్మల ఎన్నికల ప్రచార రథానికి స్వయంగా తానే డ్రైవింగ్ చేస్తూ ఖమ్మం మొత్తం తిప్పారు. తుమ్మల నాగేశ్వరరావు గెలుపు కోసం నిస్వార్థం గా కృషి చేశారు . పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పి నిరూపించుకున్న జావిద్ కు కాంగ్రెసు పార్టీ అధిష్టానం సముచిత స్థానం కల్పించాలని ఆయన అనుచరులు కోరుతున్నారు .

## మల్లారెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించిన తుమ్మల యుగందర్



ఖమ్మం సూర్య (మేజర్ న్యూస్) నగరలోని 58వ డివిజన్లో రిటైడ్ లెక్చరర్ పుట్లూరి మల్లారెడ్డి మృతి చెందడంతో వారి పార్దివ దేహానికి తుమ్మల తనయుడు తుమ్మల యుగంధర్ నివాళుర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శెట్టి రంగారావు నల్లమల వేణు, వల్లబోయిన వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు తో పాటు డివిజన్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పోచవరం లో నూతన చర్చి ప్రారంభించిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్



**కల్లూరు డిసెంబర్18(సూర్య న్యూస్):**

మండల పరిధి పోచవరం గ్రామం లో నూతనంగా నిర్మించిన చర్చిని సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాగమయి దయానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరకు ముందుగా క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు దేవుని ప్రేమ కృపా నియోజకవర్గ ప్రజలందరికీ ఉండాలని అందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అన్నారు. ఎలక్షన్ ముందు దేవుని వాగ్దానం లో మాకు " యుద్ధము యెహోవా దే " అని ప్రభువు పలుకు అందాయని, ఆ యేసు ప్రభువు దేవుడు ప్రజలందరిని సుఖ సంతోషాలతో చూడాలి అని, ఆ దేవుని ఆసిస్సులు ప్రజలందరికి అందాలి అని ప్రార్థన లో గ్రామస్తులతో కలిసి పాల్గొన్నారు... ఈ కార్యక్రమం లో కల్లూరు మండల కాంగ్రెస్ నాయకులు పుసుమర్తి చందర్రావు ,తాళ్లూరు రమేష్, ఏనుగుల సత్యంబాబు, ఆళ్లకుంట నరసింహారావు, ప్రభాకర్ చౌదరి, పాపబత్తిన నగేష్, సిపిఐ, తెలుగుదేశం నాయకులు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు..

## మంత్రి పొంగులేటిని కలిసిన మండల నాయకులు..

**సింగరేణి సూర్య మేజర్ న్యూస్**

సింగరేణి(కారేపల్లి డిసెంబర్ 18) మండల నాయకులు సోమవారం రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిశారు. ఖమ్మంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో భాగ్యనగరతండా ఎంపీటీసీ ఆలోత్ ఈశ్వరీనందరాజ్ దంపతులు,మాధారం సర్పంచ్ అజ్మీర నరేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి పొంగులేటిని కలిసి పూలబకెలతో అభినందనలు తెలిపారు.కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీల అమలు చేయటంపైనే కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఆదిశగా ఇప్పటికే చర్యలు తీసుకుంటుందని వారు తెలిపారు. బీఆర్ఎస్ నియంతృత్వ పాలనలో పేదలకు ప్రభుత్వ పథకాలు దక్కలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను అక్కున చేర్చుకిని పథకాలను అమలు చేయనుందన్నారు.మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎంపీపీ బానోత్ పద్మావతి, అజ్మీర శివనాయక్,వడ్డె వెంకటేశ్వర్లు, కుర్ర శ్రీను, శ్యామ్‌లాల్,బానోత్ రాందాస్ తదితరులు ఉన్నారు.



## ఎమ్మెల్యే రాగమయి ని కలిసిన కట్టా, ఏనుముల దంపతులు



**కల్లూరు డిసెంబర్18(సూర్య న్యూస్):**

సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ ని సోమవారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాకప్పి పుష్పగుచ్చం అందించి అనినందించి శుభాకాంక్షలు తెలిపిన కల్లూరు మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు కట్ట గోపాలరావు వారి సతీమణి రాజ్యలక్ష్మి ,హ్యూమన్ రైట్స్ ఖమ్మం జిల్లా సభ్యులు ఎనుముల ఏనుముల రుక్మిణి రాము వారి దంపతులు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ సత్తుపల్లి చరిత్ర తొలిసారిగా ఒక మహిళ ఎమ్మెల్యే గా గెలిసి చరిత్ర సృష్టించిన మట్టా రాగమయి ని వారు అభినందించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలు పొందాలని భవిష్యత్ లో మరెన్నో ఉన్నతమైన పదవులు అలంకరించాలని,నియోజకవర్గ మహిళలకు అండగా ఉండాలని వారు కోరారు.

## యోగా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులుగా రామకృష్ణ



పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్.. ఆది యోగి పరమేశ్వర యోగ ఫౌండేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షునిగా చింతకింద రామకృష్ణ నియమితులయ్యారు. పెనుబల్లి మండలం వీఎం బంజర్ గ్రామానికి చెందిన రామకృష్ణ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా పలు జిల్లాలలో ఉచిత యోగా శిక్షణలను నిర్వహించి గుర్తింపు పొందారు. ఆదియోగి పరమేశ్వర యోగ ఫౌండేషన్ ద్వారా యోగా థెరఫీ శిక్షణ పొందారు. రామకృష్ణ నైపుణ్యాన్ని గుర్తించిన యోగా ఫౌండేషన్ ఉత్తమ అసిస్టెంట్ యోగా థెరపిస్ట్ అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఆది యోగి పరమేశ్వర యోగ ఫౌండేషన్ వారు ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్షులుగా రామకృష్ణను ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షులు తుల్జాపూర్ వినోద్ నియామక పత్రాన్ని రామకృష్ణకు అందించారు.

## అన్నం పరబ్రహ్మ స్వరూపిణి

**- పెనుగొండ ఉపేందర్ రావు( లైన్స్ క్లబ్ అధ్యక్షులు)**




వైరాసూర్యమేజర్ న్యూస్: అన్నం పరబ్రహ్మ స్వరూపం అటువంటి అన్నాన్ని వృధా చేయకుండా ఇతరులకు ఉపయోగపడే విధంగా వినియోగించాలని లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్ర రావు అన్నారు. స్థానిక ఎంపీడీవో ఆఫీస్ సమీపాన లయన్స్ క్లబ్ వైరా వారి ఆధ్వర్యంలో పైడిమర్రి శ్రీనివాసరావు నూతన గృహప్రవేశం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడినారు. రైతులు ఎన్నో ప్రకృతి వైపరీత్యా లను ఎదుర్కొంటూ ధాన్యం పండిస్తున్నారని వారి శ్రమను వృధా చేయకూడదని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్రరావు, గజ్జల కృష్ణమూర్తి, పైడిమర్రి శ్రీనివాసరావు, సైదా, పమ్మి రాజు తదితరులు పాల్గొనినారు.
, రామకృష్ణ, అమర్నాథ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారాంపురంలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి మహాపడిపూజ

**సింగరేణి సూర్య మేజర్ న్యూస్**

సింగరేణి(కారేపల్లి డిసెంబర్ 18)మండలంలోని సీతారాంపురం గ్రామంలో చెన్నం శెట్టి భూషయ్య గురుస్వామి 18వ పడి సందర్భంగా ఆదివారం సాయంత్రం శరత్,( శ్రీ ఆదిత్య సాయి )నాగేష్,భద్రయ్య గురుస్వాముల ఆధ్వర్యంలో ఘనంగా నగర సంకీర్తన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రదీప్ శర్మ గురుస్వామి సమక్షంలో అత్యంత భక్తి శ్రద్ధలతో పూజ ఈ కార్యక్రమాలతో ముందుగా గణపతి పూజతో ప్రారంభించి గణపతి కుమార అయ్యప్ప స్వాముల పూజలు నిర్వహించారు.అనంతరం అయ్యప్ప స్వామి విగ్రహానికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు.శర్మ గురుస్వామి భజనతో భక్తి గీతాలు ఆలపించారు.ప్రత్యేక పూజలు18 మెట్లపై కర్పూరం వెలిగించి భక్తిని చాటుకున్నారు.అనంతరం తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలోబుచ్చి రాములు స్వామి,రమేష్ స్వామి,అమృస్వామి,బన్సీలాల్ స్వామి,మహేష్ స్వామి,నవీన్ స్వామి,మహేష్ స్వామి, కిరణ్ స్వామి,వివిధ గ్రామాల అయ్యప్ప స్వామి భక్తులు, మహిళా భక్తులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర శాంతి కళ్యాణం



**సత్తుపల్లి సూర్య మేజర్ న్యూస్:-**
పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ నగర్, మండల పరిధిలోని కాకర్లపల్లి బోడు కాలనీలోని శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో సోమవారం శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శాంతి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాలకు రావడంతో ఆలయ నిర్వాహకులు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. ఉదయం 5 గంటల నుంచి పూజా కార్యక్రమాలను ప్రారంభమయ్యాయి. సుప్రభాత సేవ, పంచామృతా భిషేకాలు, మూల మంత్ర హోమం మంత్రపుష్పం. తదితర పూజ కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పూజారులు పూజ క్రతువులను నిర్వహించారు. ఎన్టీఆర్ నగర్ లోని సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో వల్లి,దేవసేన సమేత, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో కలిసి మెలిసి జీవించాలని, వల్లి, దేవసేన,సమేత సుబ్రహ్మణ్యేశ్వర అనుగ్రహం అందరికీ లభించాలని స్వామి వారిని వేడుకున్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సాంబశివరావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వనమా శ్రీనివాసరావు , బేతిని కోటయ్య,ఆలయ కమిటీ దోసపాటి దామోదర్, రంగిశెట్టి మధు, యర మల శ్రీనివాసరెడ్డి, ఓలేటి వెంకటరమణ, బేసిన్ నాగేశ్వరరావు పెద్దిరాజు చల్లారి వెంకటేశ్వరావు, మహంకాళి పూర్ణచందర్రావు స్వాతి దంపతులు, మల్లూరి సూర్యనారాయణ, మున్నలూరి అనిల్, కోరిపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ వికలాంగుల దినోత్సవం



**ముదిగొండ సూర్య మేజర్ న్యూస్:-**
వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవ సందర్భంగా శ్రీ శక్తి భవనంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ముదిగొండ మండల ఎస్సై గజ్జల నరేష్,ఏపీఎం జి. చిన్న వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు బొజ్జ జీవ రక్తం నాయకులు పాలకీటి సీతారాములు , వైరా మండల మహిళా అధ్యక్షురాలు ఎక్కిరాల సుజాత , ఖమ్మం జిల్లా మహిళా అధ్యక్షురాలు సుకన్య .మండల అధ్యక్షులు ఇనుప ఉపేందర్, ఉపాధ్యక్షులు గుంజులూరు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. వికలాంగులకు ఎటువంటి ప్రాబ్లం వచ్చిన చేదోడు వాదోడుగా ఉంటానని మాట ఇచ్చారు. అన్ని గ్రూపులలో ఉండి వారికి కావలసిన సదుపాయాలు కల్పిస్తానని పాల్గొని ఏపీఎం చెప్పారు. ఈ కార్యక్రమంలో చింతకాని మండల అధ్యక్షులు మోరం నాగేశ్వరావు తిరుమల పాలెం మండల మహిళా అధ్యక్షురాలు భారతి నేలకొండపల్లి మండల అధ్యక్షులు మాతంగి వీరబాబు ఖమ్మం టౌన్ అధ్యక్షురాలు ఇరుకు భూలక్ష్మి ఖమ్మం జిల్లా విహెచ్పిఎస్ ఉపాధ్యక్షులు వేముల ఉపేందర్ ,రాష్ట్ర నాయుకులు పాలకిటి సీత రాముల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ వికలాంగుల అధ్యక్షులు కుంచం ఉప్పలయ్య పాల్గొని బహుమతులను అందజేశారు.

# ఏసుక్రీస్తు జననం ప్రపంచ మానవాళికి శుభదినం

## -ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

## -ముఖ్యఅతిథిగా ఫాదర్ లూర్ధు కిరణ్



**ఖమ్మం టౌన్ సూర్య మేజర్ న్యూస్**
డిసెంబర్ 18 ఖమ్మం నగరం క్రిస్మస్ పండుగలు సందర్భంగా ఖమ్మం నగరంలో శ్రీనివాస్ నగర్ యందు సెయింట్ జోసెఫ్ కతోలిక చర్చి కౌన్సిల్ మెంబెర్ అంతోటి రామకృష్ణ అధ్యక్షన ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిలుగా గుట్టల బజార్ విచారణ గురువులు ఫాదర్ తాళ్ల లాజర్, రెక్టర్ ఫాదర్ శ్రీ గువ్వల ప్రవీణ్ మరియు కరుణగిరి విచారణ గురువులు ఫాదర్ లూర్ధు కిరణ్ లు పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ఫాదర్ లూత్ కిరణ్ ఏసుక్రీస్తు యొక్క జన్మము మానవాళికి శాంతిని క్షమను ప్రసాదిస్తుందని ముందస్తుగా మనము క్రీస్తు జన్మదినాన్ని జరుపుకొనుట చాలా ఆనందదాయకంగా ఉందన్నారు అదేవిధంగా విచారణ గురువులు శ్రీ ఫాదర్ లాజరు, శ్రీనివాస్ నగర్ యూత్ సభ్యులందరినీ ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించడానికి బట్టి అభినందించారు ఈ కార్యక్రమంలో కౌన్సిల్ మెంబర్స్ సింగల్ మరియదాసు, లింగాల నాగరాజు, వేముల నరేష్, నాగండ్ల మురళి , ఉపదేశి, మొగపోతుల రాజు, శంకర్ పాల్గొన్నారు అదే విధంగా స్థానిక శ్రీనివాసనగర్ యూత్ సభ్యులు మరియు చాలా కుటుంబాలు బాలబాలికలు ఈ యొక్క సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన అంతోటి రామకృష్ణ మాట్లాడుతూ సెమీ క్రిస్మస్ వేడుకకు విచ్చేసినటువంటి ఫాదర్స్ సంఘ పెద్దలకు పాల్గొన్న కుటుంబాలకు చిన్నపిల్లలకు ధన్యవాదాలు తెలిపారు

# శీలం వెంకట నర్సిరెడ్డిని సన్మానించిన

## - పువ్వాడ దుర్గాప్రసాద్ (జిల్లా పార్టీ అధ్యక్షులు)



**వైరాసూర్యమేజర్ న్యూస్ః-**
జిల్లా కాంగ్రెస్ పార్టీ సంజీవరెడ్డి కార్యాలయంలో సోమవారం జరిగిన సన్మాన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్ర సాద్. వైరా మండల కాం గ్రెస్ పార్టీ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డికి ఆదివారము జరిగిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం గత పది సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా ఉంటూ ఎన్నో కార్యక్రమాలను టిఆర్ఎస్ పార్టీకి ఎదురు నిలబడి కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడి ఎన్నో ఆటుపోట్లు పోలీసు స్టేషన్ నందు కేసులు ఎదుర్కొని శ్రమించినందుకు పార్టీ విధేయుడుగా గుర్తించి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ మరియు ఖమ్మం పట్టణ అధ్యక్షులు దావీదు పి సి సి సభ్యులు రాయల నాగేశ్వరరావు గార్ల సమక్షంలో శాలువాతో సత్కరించారు. వారికి ధన్యవాదాలు తెలిపారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## -పారా లీగల్ వాలంటీర్ కొలిపాక నాగమణి



**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**
ఈ నెల 30 న పోలేపల్లి వద్ద జరిగే లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని పారా లీగల్ వాలంటీర్ కొలిపాక నాగమణి కోరారు. మండల కేంద్రంలో సోమవారం లోక్ అదాలత్ గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్ వలన అనేక ప్రయోజనాలు ఉంటాయని అన్నారు. రాజీ మార్గం రాజమార్గం అన్నారు. అందుకే ఇరువర్గాల వారు లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలని అన్నారు.ప్రతీ చట్టాల పై అవగాహన కల్పించుకోవాలని అన్నారు. న్యాయ సేవలు,ఉచిత న్యాయ సహాయం ను పొందాలని అమె అన్నారు. అర్హులైన వ్యక్తులు న్యాయ సేవల కోసం కమిటీల నుంచి ఉచిత న్యాయ సహాయం ను పొందవచ్చునని అన్నారు.న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అనేక సేవలు పొందవచ్చునని పేర్కొన్నారు.ఈ నెల 30 న ఖమ్మం రూరల్ మండలం లోని పోలేపల్లి పంచాయతీ వద్ద లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నటు పేర్కొన్నారు.ఈ అవకాశమును వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిలకపత్తిని వీరబాబు,కళాకారుల సంఘం నాయకులు బిక్షం, యువజన సంఘం ప్రతినిధులు కడియాల నరేష్ పాల్గొన్నారు.

# వెంకటేష్‌ను అభినందించిన ఎం.ఎల్.ఏ డా.మట్టా రాగమయి



**సత్తుపల్లి సూర్య మేజర్ న్యూస్**
గాంధీనగర్ పాఠశాలకు చెందిన ఉపాద్యాయుడు కంభంపాటి వెంకటేష్ ను సత్తుపల్లి శాసన సభ్యులు మట్టా రాగమయి సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు. ఇటీవల రాష్టంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గత 3 నెలలుగా వెంకటేష్ ఓటరు అవగాహన,చైతన్య యాత్రను చేపట్టాడు. ఓటర్లను చైతన్య పరుస్తూ జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామానికి తిరిగి ప్రచారం చేసాడు. సోమవారం సత్తుపల్లి సందర్శించిన సంధర్బంగా రాగమయి ఆయనను అభినందించారు.

# కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను పొగడ్బందీగా అమలు చేయాలి




**ఏన్కూరు సూర్య మేజర్ న్యూస్):**

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ ల పేరుతో అధికారంలోకి వచ్చిందని వాటిని పగడ్బందీగా అమలు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్య వీరభద్రం,జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ లు అన్నారు. సోమవారం పార్టీ మండల కమిటీ సమావేశం బాలాజీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలకు గెలుపు ఓటములు సహజమని అన్నారు. ప్రజలు ఈ పది సంవత్సరాల కాలంలో విసిగి ప్రభుత్వం మీద వ్యతిరేకతతో కాంగ్రెస్ ను గెలిపించారని దాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీ లతోపాటు కార్మికుల సమస్యలను నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేకపోతే కమ్యూనిస్టులుగా మేము ప్రజల తరఫున ప్రజా సమస్యల కోసం పోరాటాలు నిర్వహిస్తామని ఆయన ఈ సందర్భంగా అన్నారు తక్షణమే ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆరోగ్య శ్రీ పథకాన్ని వెంటనే అమలు చేయాలని అన్నారు గత ప్రభుత్వంలో దళిత బంధు పేరుతో బీసీ బందు పేరుతో ప్రజలను మోసం చేసి తమ పార్టీ జెండా మోసిన వారికి దళిత బందును బీసీ బందును కట్టబెట్టిందని అది పునరావృతం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన దళితులందరికీ దళిత బంధం ఇవ్వాలని అన్నారు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని నిరుపేదలైన కూలీలకు కూలి బంద్ ఇవ్వాలని కూలీలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని అన్నారు.

# ప్రభుత్వ నామినేటెడ్

**-పదవి పుచ్చకాయల వీరభద్రం కు దక్కేనా...?**

**-10సంవత్సరాలు పార్టీ కి విశేష కృషి**

**-భట్టి అనుచరుడిగా ప్రత్యేక గుర్తింపు**

**-పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు బీసీ వర్గాల సమన్వయం**



**కామేపల్లిసూర్య మేజర్ న్యూస్.**

మండల పరిధిలోని తాళ్ళగూడేం గ్రామానికి చెందిన పుచ్చకాయల వీరభద్రం కం ప్రభుత్వ నామినేటెడ్ పదవి దక్కుతుందా లేదా అనే సందిగ్ధంలో జిల్లా మండల కాంగ్రెస్ పార్టీ నేతలు ఉన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ పుచ్చకాయల వీరభద్రం యాదవ్ గత నెల 30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలలో వీరభద్ర యాదవ్ అభ్యర్థుల విజయానికి విషెష సేవలందించి ఆదర్శంగా నిలిచారు.వీరభద్రం యాదవ్ గడిచిన 30 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు పొంది పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు.కామేపల్లి సోసైటీ ఎన్నికల లో కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్ గా గెలుపొందారు. వీరభద్రం ను టీఆర్ ఎస్ లో చేరమని,చేరితే సోసైటీ చైర్మెన్ పదవి ఇస్తామని గత ఎమ్మెల్యే అడిగితే సున్నితంగా తిరస్కరించారు.10సంవత్సరాలు జిల్లా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు.ప్రస్తుత డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క కు అత్యంత సన్నిహితుడుగా ఉండి పార్టీలో కీలక పాత్ర పోషిస్తూ జిల్లాలో అందరివాడిగా పేరు తెచ్చుకున్న వీరభద్రం యాదవ్ కు ప్రభుత్వ నామినేటెడ్ పోస్టు ను కేటాయించాలని ఆ సామాజిక వర్గానికి చెందిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నేతలు,అభిమానులు, సానుభూతిపరులు కోరుతున్నారు.పార్టీ ని అధికారంలోకి తెచ్చుకోవడం కోసం,ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 10 అసెంబ్లీ స్థానాలలో యాదవ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు పార్టీ విజయానికి చేయూతనివ్వాలని కోరుతూ ఊరూరా విస్తృత ప్రచారాన్ని సైతం నిర్వహించి అభ్యర్థుల విజయానికి వీరభద్ర యాదవ్ కృషి అభినందనీయమని పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు,ప్రజా ప్రతినిధులు అనడం విశేషం.కాంగ్రెస్ పార్టీ వీరభద్రం యాదవ్ కు ప్రభుత్వం నామినేటెడ్ పోస్ట్ కేటాయించాలని జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు నాయకులు కోరుతున్నారు.

# వందే విశ్వమాతరం...ఏ త్రివేణి



**ఖమ్మం సూర్య ఎడ్యుకేషన్**

ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా మరియు 100 దేశాల్లో ఉన్న వందకు పైగా తెలుగు సంఘాల సమన్వయంతో వందేవిశ్వమాతరమ్ పేరుతో చిగురుమళ్ళ శ్రీనివాస్ 100 దేశాల్లో నిర్వహిస్తున్న శాంతి సద్భావన యాత్ర లో భాగంగా తానా అమ్మ నాన్న గురువు శతక పద్యార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది అని తానా అధ్యక్షులు నిరంజన్ శృంగవరపు తానా పూర్వ అధ్యక్షులు జయశేఖర్ తాళ్ళూరి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 10 లక్షల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. దీనిలో భాగంగా ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు డాక్టర్ చిగురుమళ్ళ శ్రీనివాస్ రచించిన అమ్మ శతకం నాన్న శతకం గురువు శతకాలలోని పద్యాలను కంఠస్థం చేసి గానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ విద్యార్థులకు మాతృదేవోభవ పితృదేవోభవ ఆచార్యదేవోభవ అనుసూక్తులను వంట బట్టిచ్చేలాగా ఈ శతకార్చన కార్యక్రమం తోడ్పడుతుందని అన్నారు.

ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఈ విధమైన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులలో అంతర్లీనంగా ఉన్న సృజనాత్మక శక్తులను వెలికితీయ వచ్చునని అందుకు ఈ కార్యక్రమం ఎంతగానో తోడ్పడిందని అన్నారు.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న ముస్తఫా అశోక్ క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్ మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అయోధ్య అక్షింతలు,కలశానికి ఘనస్వాగతం



**ఎర్రుపాలెం సూర్య మేజర్ న్యూస్ :-**

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ ద్వారా అక్షింతలు కలశాన్ని ఆ ట్రస్ట్ ద్వారా మండల కేంద్రంలోని బాల త్రిపుర సుందరి సహిత చంద్రమౌళీశ్వర దేవాలయానికి చేరుకుంది. మండల కేంద్రంలోని రింగ్ సెంటర్ నుండి అమ్మవారి ఆలయం వరకు ఘనంగా శోభా యాత్ర నిర్వహించారు. ఈ అక్షం తలు, పాంప్లెట్ ని గ్రామ,గ్రామానికి పంపిణీ చేసేందుకు కృషి చేస్తు న్నామని ఆ ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు జనవరి 1 నుండి15 వరకు పంపిణీ జరుగుతుందని మధిర నియోజకవర్గ ప్రధాన సంయోజక్ బట్ల పెనుమర్తి రాజేశ్వర శర్మ, ఎర్రుపాలెం మండల రామ జన్మభూమి ట్రస్ట్ పింగళి శ్రీనివా సరావు ఆధ్వర్యంలో జరుగుతున్నది తెలిపారు.ఈ కార్యక్రమంలో విజయ, పుప్పాల వెంకటరావమ్మ, రజిత, జానకి శివ, కొప్పు రవి దొడ్డ అశోక్ పాల్గొన్నారు.

# ఉపాధి పనులను గ్రామ సభ ద్వారా గుర్తించాలి

**-ఎంపీడీఓ.కె.జమలారెడ్డి**



**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పను లను గ్రామ సభల ద్వారా గుర్తించాలని నేలకొండపల్లి ఎంపీడీఓ కె. జమలారెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయం లో సోమవారం ఈజీఎస్ అధికారులు, సిబ్బంది పై సమీక్ష సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... ప్రతీ పంచాయతీ లో కూలీలకు తగ్గట్టుగా పనులను ఎంపిక చేయాలని అన్నారు. కూలీలకు పనుల కొరత లేకుండా సరిపడ పనులు ఉండాలని అన్నారు. ఏ పంచాయతీలో కూడ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా సొంత గ్రామంలోనే పనులు చేసుకునేలా పనులు కల్పించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.2024 -25 కు సంబంధించి పనులు ఈ నెల 31 లోపు గుర్తించాలని ఆదేశించారు.ముఖ్యంగా భూగర్భజలాలు పెంచేందుకు పనులు ఎక్కు వగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో ఈ జీఎస్ ఏపీవో సునీత,ఈసీ శేషగిరిరావు,టెక్నికల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

# సీతారాంపురంలో భక్తిశ్రద్ధలతో ఘనం అయ్యప్ప స్వామి మహాపడిపూజ...



**సింగరేణి సూర్య మేజర్ న్యూస్**

సింగరేణి(కారేపల్లి డిసెంబర్ 18)మండలంలోని సీతారాంపురం గ్రామంలో చెన్నం శెట్టి భూషయ్య గురుస్వామి 18వ పడి సందర్భంగా ఆదివారం సాయంత్రం శరత్,( శ్రీ ఆదిత్య సాయి )నాగేష్,భద్రయ్య గురుస్వాముల ఆధ్వర్యంలో ఘనంగా నగర సంకీర్తన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రదీప్ శర్మ గురుస్వామి సమక్షంలో అత్యంత భక్తి శ్రద్ధలతో పూజ ఈ కార్యక్రమాలతో ముందుగా గణపతి పూజతో ప్రారంభించి గణపతి కుమార అయ్యప్ప స్వాముల పూజలు నిర్వహించారు.అనంతరం అయ్యప్ప స్వామి విగ్రహానికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు.శర్మ గురుస్వామి భజనతో భక్తి గీతాలు ఆలపించారు.ప్రత్యేక పూజలు18 మెట్లపై కర్పూరం వెలిగించి భక్తిని చాటుకున్నారు.అనంతరం తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలోబుచ్చి రాములు స్వామి,రమేష్ స్వామి,అమృస్వామి,బన్సీలాల్ స్వామి,మహేష్ స్వామి,నవీన్ స్వామి, మహేష్ స్వామి, కిరణ్ స్వామి,వివిధ గ్రామాల అయ్యప్ప స్వామి భక్తులు, మహిళా భక్తులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇరుముడి కార్యక్రమం

అశ్వారావుపేట సూర్య, (మేజర్‌న్యూస్)–మండల పరిధిలోని నారంవారిగూడెం గ్రామంలో శబరిమలై అయ్యప్ప స్వామి సన్నిధానానికి ˘రలివెళ్లే అయ్యప్ప మాలాధారులకు సోమవారం అత్యంత వైభవంగా ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రామాలయంలో జరిగిన కార్యక్రమంలో అయ్యప్ప మాల ధరించిన పలువురు 41 రోజుల పాటు అత్యంత కఠిన దీక్షలు చేబూని ప్రతిరోజూ పూజలు నిర్వహించిన అయ్యప్పలు స్వామియే శరణం అయ్యప్ప అంటూ శరణఘోష చేస్తూ భక్తి పారవశ్యం నడము వైభవంగా ఇరుముడి కార్యక్రమాన్ని కొనిసాగించారు. అనంతరం అయ్యప్ప మాలాధారులు అలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి దొంగల కృష్ణ స్వామి ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదములు అందజేశారు. శబరిమలైలోని అయ్యప్ప దర్శనార్థం స్వాములు బయలు దేరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేష్ నాయుడు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# మీ అందరి సేవకుడిగా పని చేస్తా ఎమ్మెల్యే జారే

- త్వరలోనే ప్రతిరోజు మార్నింగ్ వాక్ ఈవినింగ్ వాక్ నిర్వహిస్తాను
- పల్లెనిద్రలో నా దృష్టికి వచ్చిన సమస్యలన్నీ పరిష్కరిస్తాను
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేర్చడమే నా లక్ష్యం
- అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ



చంద్రుగుండ,సూర్య (మేజర్ న్యూస్ )– తన మీద నమ్మకంతో నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలందరికీ ప్రత్యేకంగా కలుసుకొని ధన్యవాదాలు తెలుపుకునేందుకు ఆత్మీయ కృతజ్ఞత సభ కార్యక్రమం చంద్రుగొండ మండలంలో ప్రారంభించడం జరిగిందని. అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం చంద్రుగొండ మండలంలోని సీతాయిగూడెం, తిప్పనపల్లి, రేపల్లెవాడ, తుంగారం, గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. తన విజయంలో పాలు పంచుకున్న ప్రజలను నేరుగా కలుసుకొని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు తనను కనివిని ఎరుగని రీతిలో అత్యధిక మెజార్టీతో గెలిపించడం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నేను ఓ ఎమ్మెల్యేగా కాకుండా మీ అందరి సేవకుడిగా నిత్యం తమతో పాటే ఉంటూ తమ సమస్యల పరిష్కారంలో ముందుంటానన్నారు. గతంలోనే పల్లెనిద్ర కార్యక్రమం ద్వారా అనేక సమస్యలను గుర్తించడం జరిగిందన్నారు. వాటిని పరిష్కరించే దిశగా త్వరలోనే ప్రతి గ్రామంలో మార్నింగ్ వాక్ ఈవినింగ్ వాక్ ప్రారంభించి సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు కూడా చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిత్యం ప్రజల్లోనే ఉంటానన్నారు. తన గెలుపు కోసం ప్రయత్నించిన ప్రతి ఒక్కరి ఇంటికి నేరుగా వెళ్లి కృతజ్ఞతలు తెలుపుటకే ల ఈ ఆత్మీయ కృతజ్ఞత సభ కార్యక్రమం చంద్రుగొండ మండలం నుంచి ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, మండల నాయకులు మాలోత్ బోజ్యా నాయక్, సారేపల్లి శేఖర్, ఉప్పతల ఏడుకొండలు, సొసైటీ చైర్మన్ చెవుల చందర్ రావు, నల్లమోతు రమణ, కీశరి శాంతమ్మ, పద్దం వినోద్, బొర్రా సురేష్, ఫజల్ బక్స్, సంకా శంకర్, యాసం కాశీ, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# శాఖలవారీగా ప్రగతి నివేదికలను అందచేయాలి





**–ఈ నెల 21 తేదీన కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమావేశం**

కొత్తగూడెం కలెక్టరేట్ ,సూర్య ( మేజర్ న్యూస్ )– అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలు అందచేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో అన్ని శాఖల అధికారులతో ప్రగతి నివేదికలు అందచేసే అంశంపై, అలాగే వీడియో కాన్ఫరెన్సు ద్వారా అన్ని మండలాల తహసిల్దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన అన్ని జిల్లాల కలెక్టర్లుతో రాష్ట్ర ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించనున్న సందర్భంగా ఆయా శాఖల వారిగా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రగతి నివేదికలు అందచేయాలని చెప్పారు. ఈ నెల 20వ తేదీన కేంద్రప్రభుత్వ పథకాలు అమలుపై ఉదయం 10 గంటలకు డిప్యూటి సెక్రటరి, జిల్లా ప్రభారి అధికారి రవిప్రసాద్ ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించనున్న సమీక్షా సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని చెప్పారు. సమావేశానికి హాజరయ్యే ఆయా శాఖల అధికారులకు సమావేశం నిర్వహణ సమాచారం అందించడం జరిగిందని, తప్పని సరిగా హాజరు కావాలని చెప్పారు. తహసిల్దార్ కార్యాలయాల్లో పెండింగ్ ఉన్న ధృవీకరణ పత్రాలు జారీకి చర్యలు చేపట్టాలని చెప్పారు. సర్టిఫికేట్లు కొరకు లబ్దిదారులను కార్యాలయాల చుట్టూ త్రిప్పుకోవద్దని చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్రాజు, డిఆర్ రవీంద్రనాథ్, అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల పక్షాన గళం విప్పుతా



**–కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని**

కొత్తగూడెం ,సూర్య (మేజర్ న్యూస్ )– సంఘటిత, అసంఘటిత కార్మికుల పక్షాన చట్టసభలో గళం విప్పుతానని కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. స్థానిక శేషగిరిభవన్ నందు సోమవారం జరిగిన సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల సమావేశంలో అయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో కార్మికుల హక్కులు, కనీస వేతనాలు అమలుకు నోచుకోలేదని, నిత్యం నిర్బంధాలతో పాలనా సాగించారని విమర్శించారు. కార్మికచట్టాలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యంచేస్తుంటే పరోక్షంగా సహకరించారని ఆరోపించారు. క్రమబద్ధీకరణ హామీని అమలుచేయలేకపోయారని, కేంద్ర నిర్ణయాలను అమలుచేస్తూ ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటురంగంగా మార్చివేస్తున్నారని అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో అత్యధికమంది కార్మికులు తనపై నమ్మకంతో చట్టసభకు పంపారని, వారి ఆశయాలకు అనుగుణంగా సమస్యల పరిస్కారం, చట్టాల అమలుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు కూనంనేనిని శాలువాలు, పూలమాలలు, బొకేలతో సత్కరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, వంగ వెంకట్, కంచర్ల జమలయ్య, రామకృష్ణ, అమర్నాథ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్యానల్ స్పీకర్ గా నియమించడం పట్ల హర్షం.



టేకులపల్లి సూర్య (మేజర్ న్యూస్ )–కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలుపొందిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్యానల్ స్పీకర్ గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు ముగించుకొని కొత్తగూడెం పట్టణానికి తిరిగి వచ్చిన కొత్తగూడెం ఎమ్మెల్యే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావుకు అభినందనలు తెలిపి శాలువాతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కౌన్సిల్ సభ్యుడు గుగులోతు రామచందర్ సత్కరించారు . తెలంగాణలో నిరంకుశ పాలన విముక్తి కోసం పోరాటం చేసి రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ టేకులపల్లి మండల వైస్ ప్రెసిడెంట్ అయిత శ్రీరాములు, టేకులపల్లి మండల మహిళా సంఘం నాయకురాలు గుగులోతు సోనీ, డాక్టర్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్ టియూసీ లో చేరికలు

కొత్తగూడెం సింగరేణి ,సూర్య(మేజర్ న్యూస్) – కొత్తగూడెంలోని మెయిన్ వర్క్ షాప్ లో పిట్ మీటింగ్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ మీటింగ్ లో బ్రాంచ్ సెక్రటరీ పితాంబర రావు సమక్షంలో దాదాపుగా 15 మంది కార్యకర్తలు ఐఎన్టీయూసీ లో జాయిన్ అవ్వడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జనరల్ సెక్రెటరీ త్యాగరాజన్ ఐఎన్టియుసి రిలీజ్ చేసిన మెనీఫెస్టో గురించి కార్మికులకు వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ , బ్రాంచ్ సెక్రటరీ మహేష్ కుమార్ , ప్రచార కమిటీ కన్వీనర్ విల్సన్ ,ఎస్ ఎన్ పి సి నుండి జె శ్రీనివాస్, ట్రెజర్ రమేష్ , ఐఎన్టీయూసీ కార్యకర్తలు, మెయిన్ వర్క్ షాప్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే కూనంనేనిని సన్మానించిన మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్ లు





కొత్తగూడెంటౌన్, సూర్య (మేజర్ న్యూస్)– కొత్తగూడెం శాసన సభ్యులుగా ఎన్నిక అయిన శుభసంధర్బంలో కూనంనేని సాంబశివరావు రావు ని వారి ఇంటి వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి అద్వర్యంలో పురపాలక సంఘ వైస్ చైర్ పర్సన్, బిఆర్ఎస్ వార్డు కౌన్సిలర్ లు , పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలసి కలిసి పూల బోకే ఇచ్చి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమములో వైస్ చైర్ పర్సన్ వేల్పుల దామోదర్, బి ఆర్ ఎస్ వార్డు కౌన్సిలర్ లు కొలపురి ధర్మరాజు, పరమేష్ యాదవ్, వేముల ప్రాసాద్, అంబుల వేణు గోపాల్, బండి నరసింహారావు, రుక్మధర్ బండారి, పల్లపు లక్షణ్, సాహేరా బేగం,వనచర్ల విమల, కొత్తగూడెం పట్టణ బిఆర్ఎస్ నాయకులు యూసుఫ్, బాలసేట్టి సుందర్ రాజ్, రజాక్, మాధ శ్రీరాములు, బ్యాండ్ దుర్గ, యస్.వి.యాన్.స్వామి,కూరపాటి సుధాకర్, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలువడం జరిగినది.

# ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన వ్యాన్






**– ఒకరు మృతి... మరొకరి పరిస్థితి విషమం..**

దమ్మపేట సూర్య (మేజర్ న్యూస్ ) – ద్విచక్ర వాహనాన్ని వేగంగా వచ్చి అశోక లేలాండ్ వ్యాన్ ఢీ కొట్టడంతో ఒకరు అక్కడకక్కడే మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి ముష్టిబండ గ్రామ వాసులు తెలిసిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని వడ్లగూడెం గ్రామ శివారులో ఉన్న మల్లేశ్వర స్వామి ఆలయంలో పనిచేస్తున్న వెంకటేష్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై ముష్టిబండ నుంచి వడ్లగూడెం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో వెనక నుండి వస్తున్న అశోక లేలాండ్ వ్యాన్ బలంగా ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై వెంకటేష్ అనే వ్యక్తి అక్కడక్కడ మృతి చెందగా వాహనంపై మరో వ్యక్తి ఉండటంతో ఆ వ్యక్తికి బలమైన గాయలు తలకు తగలడంతో పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై రవికుమార్ సగటున స్థలానికి చేరుకొని వ్యాను నడుపుతున్న డ్రైవర్ పై కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బడి బయట పిల్లలకు గుర్తింపు సర్వే

టేకులపల్లి, సూర్య (మేజర్ న్యూస్) – మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో పరిధిలో ఓఎస్సీ సర్వే ఉపాధ్యాయులు, సిఆర్పి లు జిల్లా డీఈవో ఆదేశానుసారం డిసెంబర్ 10 వ తారీకు నుంచి జనవరి 11వరకు టేకులపల్లిలో ఉన్న 6 కాంప్లెక్స్‌లో సిఆర్పిలు తమ తమ కాంప్లెక్స్ లో అన్ని పాఠశాల పరిధిలో ఉన్న బడి బయట పిల్లలను గుర్తించి తిరిగి బడిలో చేర్పించడం జరుగుతుందని సోమవారం తెలిపారు. కుంటల కాంప్లెక్స్ పరిధిలోని మంగలి తండా గ్రామంలో ఇద్దరు పిల్లలు చాలా రోజుల నుంచి బడికి వెళ్లకుండా కూలికి వెళ్తున్నట్టు తెలిసి చేనుకు వెళ్లి చదువు గొప్పదనం గురించి దానివల్ల కరిగే ప్రయోజనాలు గురించి వివరించి తిరిగి పాఠశాలకు వెళ్లే విధంగా చేయడం జరిగిందన్నారు. ప్రతిరోజు తమ పరిధిలో ఉన్న పాఠశాల ఊరిలో బడి బయట పిల్లలను గుర్తించి అదే పాఠశాలలో చేర్పించడం జరుగుతుందన్నారు.



## ఈ నెల 21కి వాయిదా వేసిన హైకోర్టు

**– సింగరేణి ఎన్నికల నిర్వహణకు మరికొంత సమయం కావాలి**
**– కోర్టులో వాయిదా కోరిన రాష్ట్ర ప్రభుత్వ ఎనర్జీ సెక్రటరీ**
**– ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకుంటున్న కార్మిక సంఘాలు**

కొత్తగూడెం సింగరేణి, సూర్య (మేజర్న్యూస్) – ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణిలో జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికలపై రాష్ట్ర హైకోర్టులో సోమవారం జరిగిన విచారణలో మరోసారి వాయిదా వేసింది. సింగరేణి ఎన్నికల నిర్వహణకు మరికొంత సమయం కావాలంటూ రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసిన విషయంలో హైకోర్టు ఈ వాయిదా వేసింది. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగుతాయో లేదో అన్న మిమాంసా కొట్టుమిట్టాడుతున్న క్రమంలో అత్యున్నత న్యాయస్థానం తీసుకున్న నిర్ణయం కార్మికవర్గాన్ని అయోమయానికి గురిచేసింది. గుర్తింపు సంఘం ఎన్నికలపై హైకోర్టులో వాదానలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల బరిలో నిలిచిన కార్మిక సంఘాల నాయకులు మాత్రం తమ ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఈ నెల 27వ తేదీన జరగాల్సిన ఎన్నికలు మరికొంత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## విప్లవ సంఘాలను గెలిపించండి – సాదినేని




ఇల్లందు టౌన్, సూర్య (మేజర్ న్యూస్) – డిసెంబర్ 27న జరిగే సింగరేణి ఎన్నికల్లో చక్రంలో సుత్తి గుర్తుకు ఓటేసి విప్లవ కార్మిక సంఘాలను గెలిపించాలని గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం(జి ఎల్ బి కే ఎస్)రాష్ట్ర అధ్యక్షులు సాధినేని వెంకటేశ్వరరావు, ఐఎఫ్ టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి కార్మికులకు విజ్ఞప్తి చేశారు.సింగరేణి ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఇల్లందు జెకె–5 ఓసిలో, జిఎం కార్యాలయంలో నిర్వహించిన ప్రచార మీటింగులలో వారు పాల్గొని మాట్లాడారు.జిఎల్ బికెఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బయ్యా వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిఎల్‌బికెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. సీతారామయ్య,(సిపి ఐ)ఎంఎల్ న్యూడెమోక్రసీ ఇల్లందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు ఎండి. రాసుద్దిన్,బానోతు రామ్ సింగ్,ఇల్లందు ఏరియా కమిటీ అధ్యక్షులు డి.మోహన్ రావు,జిల్లా నాయకులు రామిశెట్టి నరసింహారావు, ఉమామహేశ్వరరావు, ప్రివైఎల్ రాష్ట్ర నాయకులు మోకాళ్ళ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి డే సందర్భంగా మహిళలకు క్రీడా పోటీలు



ఇల్లందు, సూర్య (మేజర్ న్యూస్)– ఈనెల 23న జరగనున్న సింగరేణి దినోత్సవము సందర్భంగా సింగరేణి సేవ సమితి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు, సేవా సభ్యులకు, ట్రైనర్స్ కు సింగరేణి కుటుంబ సభ్యులకి సోమవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడలలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడలలో పాల్గొని విజేతలైన వారికి ఈనెల 23న జరిగే సింగరేణి దినోత్సవ వేడుకలలో జిఎం చేతుల మీదగా బహుమతులు అందజేస్తారు.ఈ కార్యక్రమంలో ఏరియా సీనియర్ పర్సన్ ఆఫీసర్ సాయి స్వరూప్, సింగరేణి ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ సుధాకర్, సేవా సమితి కోఆర్డినేటర్ బి.కే సాంబయ్య, సేవ సెక్రటరీ విజయ, సులక్షణ సేవా మెంబర్లు ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి డే సందర్భంగా మహిళాలకు క్రీడా పోటీలు

కొత్తగూడెం సింగరేణి, సూర్య (మేజర్ న్యూస్)– కొత్తగూడెం ఏరియాలో సింగరేణి దినోత్సవ వేడుకలు–2023 సందర్భంగా రుద్రంపూర్, గౌతంపూర్ మహిళలకు ఆటల పోటీలను సోమవారం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఏరియా సేవ ప్రెసిడెంట్ జి.మధురవాణి షాలేం రాజు పాల్గొని పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగరేణి సంస్థ గృహిణిలకు , నిరుద్యోగ యువతకు వివిధ ఉచిత వృతి శిక్షణ కోర్సులను ఇస్తుందని తెలిపారు. ఈ వృతి శిక్షణ కోర్సులను నేర్చుకొని వారు పెడతన్న వారి కుటుంబానికి స్వయం ఉపాది పొందాలని తెలియజేశారు.ఈ పోటీలలో గెలుపొందిన వారికి ఈ నెల 23న ప్రగతి వనంలో జరుగు సింగరేణి దినోత్సవ వేడుకలలో బహుమతుల ప్రధానం జరుగునని, ఈ వేడుకలకు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పద్మజా రాణి కోటి రెడ్డి, డి.వై.పిఎం. జికేఓసి, ఎం. శ్రావణ్ కుమార్,కో–ఆర్డినేటర్ సాగర్, సేవ సెక్రటరీలు అనిత, సేవ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.



# సిఐటియు గెలిస్తే కార్మికులు గెలిచినట్లే...



**-ఒక్కసారి అవకాశం ఇవ్వండి**
**-ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటెయ్యండి .**
**- మంద నరసింహారావు పిలుపు.**

కొత్తగూడెం సింగరేణి ,సూర్య(మేజర్ న్యూస్) – సింగరేణి బొగ్గు బావుల వద్ద, కార్పొరేట్ ఏరియాలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పిట్ మీటింగ్ ల, గాగేట్ మీటింగులను సోమవారం నిర్వహించారు. ఈ మీటింగ్ లో సింగరేణి కాలేజ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు మాట్లాడుతూ సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నా సిఐటియు యూనియన్ నీ గెలిపించాలని, సింగరేణి ప్రైవేటు పరం చేస్తున్న యూనియన్లను ఓడించేందుకు ప్రతి కార్మికుడు సిద్దంగా ఉండాలని కోరారు . ఒక్కసారి సీఐటీయూ నీ గెలిపిస్తే , కార్మికుల సత్తా చాటుతాం అని అన్నారు.యాజమాన్యం కు తలొగ్గి, కార్మికుల జీవితాలను తాకట్టు పెట్టే సంఘాలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం, సొంత ఇంటి కల కోసం, సింగరేణిలో జరుగుతున్న అవినీతి కార్యకలపాలని అరికట్టేందుకోసం కృషి చేస్తున్న సిఐటియు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ని గెలిపించాలని కార్మికులను కోరారు . ఇప్పటివరకు అధికారంలో ఉన్న యూనియన్లు కార్మికుల హక్కులు కాలరాసే విధంగా సింగరేణి సంస్థను బొగ్గు బ్లాక్లుగా వేరుచేసి ప్రైవేటుపరం చేసే పద్ధతికి శ్రీకారం చుట్టాయని అన్నారు. కార్మికులు కష్టపడి తమ రక్తాన్ని చమట చుక్కగా చేసి శ్రమటోడ్చి పనిచేస్తున్న కార్మికులకు అండగా నిరంతరం సిఐటియు నిలబడిందన్నారు. ప్రైవేటీకరణను కార్మికుల హక్కుల కాపాడేందుకు సిఐటియు కృషి చేసిందని గుర్తు చేశారు. వేతన ఒప్పందాల విషయంలో కార్మికులకు న్యాయం చేసే విధంగా జేబీసీసీఐ సమావేశాల్లో గట్టిగా కొట్లాడి హక్కులు సాధించుకోవడం జరిగిందన్నారు .కాబట్టి సీఐటీయూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ని గెలిపించాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్, సింగరేణి కాలనీ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్, నాయకులు వై వెంకటేశ్వరరావు, సురం ఐలయ్య, కర్ల వీరాస్వామి, కే రమేష్ బాబు ,నాజర్, సమ్మయ్య ,రామ్మూర్తి, డి వీరన్న, భూక్య రమేష్, లిక్కి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ మంత్రి పొంగులేటిని సన్మానించిన డిసిఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల



పాల్వంచ, సూర్య(మేజర్ న్యూస్) – రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని డిసిఎంఎస్ వైస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సోమవారం ఖమ్మంలోని పొంగులేటి కార్యాలయంలో పాల్వంచకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కలిశారు. పాల్వంచ నుండి ఖమ్మం వరకు కొత్తగూడెం నియోజకవర్గం లోని సుమారు 100 వాహనాలతో ర్యాలీలి నిర్వహించారు. అనంతరం పొంగులేటి ని శాలువా, బొకే లతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొత్వాల తో పాటు పాల్వంచ మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, నందా నాయక్, కొత్తగూడెం కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, తూము చౌదరి, తోట దేవీప్రసన్న, బాదార్ల జోషి, కందుకూరి రాము, పిట్టల రాము, పులి సత్యనారాయణ, వజ్జల రాము, ధారా చిరంజీవి, కోండం పుల్లయ్య, సర్పంచ్ అనిత, నాగిరెడ్డి, గంధం నర్సింహారావు, వెంకట రెడ్డి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కోనుగోలులో ధళారుల దోపిడీని అరికట్టాలి

**-నిమ్మల రాంబాబు**



పాల్వంచ, సూర్య(మేజర్న్యూస్) – ధాన్యం కోనుగోలులో ధళారుల దోపిడీని అరికట్టాలని ప్రజాఫంథా పార్టీ.జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం పాల్వంచలోని సిపిఐ (ఎం–ఎల్) ప్రజాపంథా పార్టీ. కార్యాలయంలో జరిగిన ముఖ్యుల సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ రైతాంగానికి పంట చేతికొచ్చే సమయంలో. ప్రభుత్వ అధికారులు తగిన ప్రాధాన్యత కల్పించి. గిట్టు బాటుధర తో రైతాంగ పంట కొనుగోలు చేయడంలో పర్యవేక్షణ లోపించుట వలన ఇదే అదునుగా భావించిన దళారులు రైతుల ను మోసం చేస్తూ తక్కువ ధర చెల్లించి, నిలువునా దోచుకుంటున్నారన్నారు. గ్రామాల లో చదువురాని పేదల కు. ధాన్యం కాంటా (తూకం)లో జరిగే మోసం కూడా తెలియదని, ప్రతి సం”రం.పంట చేతికొచ్చిన సమయంలో ఒక పక్క ప్రకృతి ,మరోపక్క ధళారులు ఇలా ఎన్నాళ్లైనా ఇలానే నష్ట పోయే పరిస్థితి ఏర్పడుతున్నదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాలకులు రైతాంగ సమస్యల ను పరిష్కరించాలని, ధళారుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. పంటను కల్లంలో ప్రభుత్వ మే నేరుగా కొనుగోలు చేయాలని, రైతాంగ పంటలకు గిట్టు బాటుధర ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో పార్టీ పాల్వంచ మండల కార్యదర్శి. పూనెం రమేశ్, పట్టణ నాయకులు పి.సంజీవరావు, ప్రజాసంఘాల నాయకులు యం.అజయ్, మనోజ్, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా ల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



ఇల్లందు సూర్య ( మేజర్ న్యూస్)– ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య చేతుల మీదుగా స్థానిక 14వ వార్డుకు చెందిన ఇద్దరు లబ్ధిదారులకు ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎన్నికల సమయంలో ప్రజలకు చేసిన వాగ్దానాలను నూటికి నూరు శాతం నెరవేస్తుందని ఆయన అన్నారు. ప్రజల విజ్ఞప్తులను అధికారులు పరిగణలోకి తీసుకొని పనిచేయాలని, ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే తన ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీ పాషా, ఇల్లందు ఎంపీడీవో బాలరాజు, తాసిల్దార్ కోట రవికుమార్, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, వైస్ ఎంపీపీ ప్రమోద్ కుమార్,వార్డు కౌన్సిలర్ సంద బిందు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే కోరంను మర్యాదపూర్వకంగా కలిసిన ఏరియా జియం



ఇల్లందు సూర్య (మేజర్ న్యూస్)–ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇల్లందు నియోజకవర్గం నుండి అత్యధిక మెజార్టీతో గెలుపొందిన కోరం కనకయ్యను సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నూతన జెకె ఓసి ప్రాజెక్టు గురించి ఎమ్మెల్యేకు తెలియజేసి తగు సహకారాన్ని అందించాలని కోరాగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి కావలసిన సహకారాన్ని అందజేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి శివ కుమార్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు మీటింగ్

**-పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జమలయ్య**




కొత్తగూడెం,సూర్య(మేజర్ న్యూస్) – కొత్తగూడెం అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు మీటింగ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోనెమణి అధ్యక్షతన సోమవారం జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ కౌన్సిలర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంచర్ల జమలయ్య మాట్లాడుతూ సుదీర్ఘ పోరాట ఫలితంగా రాష్ట్రంలో ఉన్న మినీ అంగన్వాడి కేంద్రాలను కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెయిన్ సెంటర్ గా అప్డేట్ చేయటం సంతోషదాయకరమన్నారు. అదేవిధంగా అంగన్వాడీ టీచర్ల సమస్యల కోసం కొత్తగూడ నియోజకవర్గ శాసనసభ్యులు సాంబశివరావు అసెంబ్లీలో అంగన్వాడీ టీచర్లని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర శాసనసభలో మాట్లాడిన ఏకైక ఎమ్మెల్యే అని అన్నారు. అంగన్వాడి టీచర్ల సమస్యలు అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే కి భద్రాద్రి కొత్తగూడెం ఏఐటీయూసీ జిల్లా సమితి , అంగనవాడి వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో 11వ వార్డు కౌన్సిలర్ భూక్య శ్రీనివాస్, ప్రమీల, కనకమ్మ, కళావతి, శ్రీదేవి, రూప, లావణ్య, కమల తదితరులు పాల్గొన్నారు.

### అయ్యప్ప దేవాలయంలో స్వాముల ఇరుముడి కార్యక్రమం

**– పాల్గొన్నడిసిఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల**

పాల్వంచ, సూర్య(మేజర్ న్యూస్) – తెలంగాణ రాష్ట్రంలోనే పేరొందిన అయ్యప్పస్వామి దేవాలయంగా కీర్తింపబడుతున్న పాల్వంచ దేవాలయంలో స్వాములకు ఇరుముడి కార్యక్రమాలు జరుగుతున్నాయి. సోమవారం జరిగిన ఇరుముడి కార్యక్రమాల్లో డిసిఎంఎస్ వైస్ చైర్మన్, అయ్యప్ప దేవాలయ కమిటీ సభ్యులు కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. గురుస్వాములు బి వెంకటేశ్వరావు, చెరుకు అశోక్, కందుకూరి శ్రీనివాసరావు, మల్లెల వీరనారాయణ, సురేష్ లు తదితరులు ఇరుముడి కట్టుకొని కేరళలోని శబరిమలకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు కేశబోయిన కోటేశ్వరావు, కేటిపిఎస్ డిఈ రాందాస్, కందుకూరి రాము, తోట కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



# అవ్యక్త గెల్లాకు అత్యంత "మేధావి అవార్డు"

**- సామాజిక, విద్యపరమైన సమతుల్యత అనే వ్యాసంపై**
**- అంపవర్ సంస్థ నిర్వహించిన పోటీల్లో సత్తాచాటిన అవ్యక్త**





కొత్తగూడెం టౌన్, సూర్య (మేజర్‌న్యూస్) – అమెరికాలోని సియాటల్ నగరంలో అంపవర్ సంస్థ నిర్వహించిన పోటీల్లో పదమూడేళ్ళ అవ్యక్త గెల్లా అనే బాలిక అత్యంత మేధావి అనే అవార్డును గెలుచుకోవడం ఆ నగర చరిత్రలోనే తొలిసారిగా నిలిచింది. ఇటీవల సియాటల్ నగరంలో అంవవర్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో 40 మంది పాల్గొనగా కొత్తగూడెంలోని వసుంధర–సుమంగళి అధినేత తాటిపల్లి శంకర్‌బాబు మనవరాలు అవ్యక్త గెల్లా అవార్డును కైవసం చేసుకుంది. 13 యేళ్ల వయసు నుండి 30 యేళ్ళ వయసు వరకు ఉన్న మహిళలు సైతం ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సంస్థను మేనకసోనీ అనే మహిళ నిర్వహిస్తుంది. ఇది ఒక అలాభయ సంస్థ అవ్యక్త మిస్‌టీంగ్ విభాగంలో తొలిసారిగా పాల్గొని తన ప్రతిభతో అందరిని ఆకట్టుకుంది. కాంగోలో జరుగుతున్న "మౌన నరమేధం" గురించి ఆమె చేసిన ప్రసంగం అనేకమందిని ప్రభావితం చేసింది. ఆమె ఆకలితో ఉన్న ప్రజలకు ఆహారం అందేలా సహాయం చేయాలని, దానం చేయాలని కోరింది. సియాటల్‌లో జరిగిన ఈ గొప్ప ఈవెంట్‌లో 13 యేళ్ళ అవ్యక్త తన ప్రతిభతో 40 మంది పోటీదారుల్లో అత్యంత మేధావి అనే అవార్డును ఆ సంస్థ ప్రతిష్టాత్మక ప్రజెంట్‌షోలో గెలుచుకోవడం పలువురిని ఆకట్టుకుంది. ప్రేక్షకులను అవ్యక్త చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. అత్యంత ఆసక్తితో, ఉద్వేగంతో ఆహుతులు అలకించారు. ప్రసంగ సమయంలో వావ్ వావ్ అనే పదాలతో సభికులు అలరింపచేశారు. అవ్యక్తగెల్లా తాను 7వ తరగతి చదువుతున్న సమయంలో చేసిన ప్రసంగం డిబెట్‌లలో పాల్గొనడం జరిగింది. సదరు తరగతులకు కొన్ని వారాల క్రితమే ఆమె చేరారు. ఈ పోటీలో అవార్డును ప్రకటించిన సమయంలో ప్రకటనకర్త అభినందించారు. అవ్యక్త ప్రసంగంలో మేధావితనంతో పాటు సృజనాత్మకత కూడా కనిపించింది. అమెరికాలో అత్యంత మేధావి అవార్డు అందుకోవడం పట్ల వసుంధర–సుమంగళి యజమాని శంకర్‌బాబు, ఆయన కుటుంబసభ్యులు అభినందించారు.

## దమ్మపేట గౌడ సంక్షేమ సంఘం చేయూత..

–



**బాధితుడికి రూ.10 వేలు అందచేత..**

దమ్మపేట, సూర్య (మేజర్‌న్యూస్) – చెట్టు మీద నుండి జారిపడి కాలుకు బలమైన గాయమై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాజులపాటి మల్లయ్యను మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో బాధితుడికి చేయూతనందించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గౌడ సంఘం సభ్యుడు రాజులపాటి మల్లయ్యకు గౌడ సంఘం అధ్యక్షులు పానుగంటి చిట్టిబాబు రూ.10వేలను సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు యార్లగడ్డ బాబు, బంధం శ్రీనివాసరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోరం కనకయ్యకు శుభాకాంక్షలు తెలిపిన మిత్ర బృందం



ఇల్లందు, సూర్య (మేజర్ న్యూస్) – భారీ మెజార్టీతో గెలుపొందిన ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్యను ఆయన మిత్రబృందం, జిల్లా కాంగ్రెస్ నాయకులు చింతలపూడి వెంకన్న.చింతలపూడి శేఖర్ ,టేకులపల్లి నాయకులు తిరుపతి, ఇల్లందు కాంగ్రెస్ నాయకులు కూరగాయల జానీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ కార్యదర్శి అక్కిరాజు గణేష్, టీచర్ వెంకన్న, జిల్లా ఐఎన్టీయూసీ నాయకులు ఎస్.కె.జానీమియా, సుజాతనగర్ నాయకులు కే.నాగేశ్వరావులు శాలువాలు, పూలమాలలతో క్యాంపు కార్యాలయంలో అభినందించారు.

# భద్రాచలం పట్టణ బావిలో మృతదేహం

**– పోలీసులకు సమాచారం అందించిన స్థానికులు...**



భద్రాచలం, సూర్య (మేజర్‌న్యూస్)– భద్రాచలం పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్ సలీం టీ స్టాల్ ఎదురు సందులో గల బావిలో పట్టణానికి చెందిన కరీం అనే యువకుడు మృతి చెంది ఉండడాన్ని గ్రహించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని బావి నుండి వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. హత్యా, లేక ఆత్మహత్యా లేక పొరపాటున బావిలో పడి చనిపోయాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. మృతి చెందిన యువకుడు ల్యాబ్ ప్రభుత్వ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ నిర్వహిస్తున్నట్టు సమాచారం.

## ఘనంగా కామ్రేడ్ రావి సీతయ్య ప్రథమ వర్ధంతి



దమ్మపేట,సూర్య (మేజర్ న్యూస్ )–మండల పరిధిలోని ముష్టిబండ గ్రామంలో కామ్రేడ్ రావి సీతయ్య ప్రథమ వర్ధంతి సోమవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా రావి సీతయ్య స్థూపం వద్ద జెండా ఆవిష్కరణ నిర్వహించి ఘనంగా నివాళు లర్పించారు సిపిఎం మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అమరజీవి రావి సీతయ్య చిత్రపటానికి పూలమాల లేసి సిపిఎం పార్టీ జిల్లా సభ్యులు దొడ్డా లక్ష్మీనారాయణ ఘనంగా నివాళు లర్పించారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పిట్టల అర్జున్ రావు, మాట్లాడుతూ రావి సీతయ్య ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు రావి సీతయ్య జమీందారులు పెత్తందారుల ఆగడాల నుండి ప్రజలను, గిరిజలను, దళితులను, రైతులను, కాపాడిన తీరును వారు గుర్తు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, రావి సీతయ్య అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకులాల ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానం

పాల్వంచ, సూర్య (మేజర్‌న్యూస్) – తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఖమ్మం రీజినల్‌లో నడపబడుచున్న సి.ఓ.ఈలలో 2024–2025 విద్యా సంవత్సరమునకు గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపిసి/బిపిసి కోర్సుల్లో అడ్మిషన్లకై మార్చి–2024 లో 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న SC/ST/BC/HC/(CONVERTED CHRISTIAN), ూజ బాల బాలికల నుండి ఆన్లైన్ ద్వారా ూఔ=జీజ జుూజుజజు–2024 కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం రీజియన్ ప్రాంతీయ సమన్వయాధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రతిభా కళాశాలలలో IIT-JEE, NEET, CMA, CLAT పరీక్షల కొరకు ఇంగ్లీష్ మీడియంలో ఉచిత భోదన, మంచి శిక్షణతోపాటు, చక్కటి సదుపాయాలు కల్పించబడునన్నారు. అర్హులైన అభ్యర్థులు ఆన్లైన్‌లో ంషతీవఱం.ఖఎ.ఱఱ వెబ్‌సైట్‌లో రూ.200/– చెల్లించి, దరఖాస్తు సంర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో జనవరి–15, 2024 లోపు నమోదు చేసుకోవాలని, ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలోని కాలేజీల లో యందు మెరిట్, ప్రాధాన్యత ఆధారముగా ప్రవేశం కల్పించ బడును. ఎంపిసి, బిసిసి గ్రూపులకు బాలికలు ఖమ్మం జిల్లాలోని Dr.BRACTSWRJC(G), COE, TSWRS/JC[G].COE, కళశాలల్లో ఎంపిసి, బిపిసి గ్రూపులకు బాలురు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ూఔ=ూ/జీజళిదీరి,జూజు, కళాశాలో సీట్లు పొందుటకు అప్లై చేసుకోగలరని కోరారు.

## క్రీడా దుస్తులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

దమ్మపేట సూర్య (మేజర్ న్యూస్ )–మండల పరిధిలోని అంకంపాలెం బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించనున్న క్రీడలకు గాను క్రీడాకారులకు క్రీడల దుస్తులను అశ్వరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ సోమవారం పంపిణీ చేశారు ఈ సందర్భంగా కోంద్రు శ్రావణ్ కుమార్ ఏర్పాటు చేసిన దుస్తులను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ క్రీడాకారులకు అందజేసి క్రీడలలో విజయం సాధించి ఉన్న ఊరు కన్న తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో కోరసా సాగర్, వాడే వెంకట్రావు, కాకా ప్రసాద్, పొట్టా శివాజీ, సోయం చరణ్, మరియు అంకంపాలెం గ్రామ జారే యువసేన యువకులు పాల్గొన్నారు.



## ఆరోగ్య కేంద్రం ప్రారంభ పలకాన్ని ధ్వంసం చేసిన దుండగులు..





దమ్మపేట, సూర్య (మేజర్‌న్యూస్) – మండల కేంద్రంలోని మల్లారం కాలనీ వద్ద అశ్వరావుపేట నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు మెచ్చ నాగేశ్వరావు ప్రారంభించిన ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభ ఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు ప్రారంభ పలకాన్ని కాకుండా ఆరోగ్య ఉపకేంద్రం తలుపులను పగలగొట్టి లోపల ఉన్న మందులను చిందర వందర చేసి ఉడాయించారు సోమవారం ఉదయాన్నే ఆరోగ్య ఉపకేంద్రం సిబ్బంది వెళ్లి చూడగా మాజీ శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరరావు ప్రారంభించిన పలకాన్ని ధ్వంసం చేసి ఉండటంతో స్థానికులకు తెలపడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆరోగ్య ఉపకేంద్ర సిబ్బంది తెలిపారు